ఈనాడు
నంద్యాల
శుక్రవారం సెప్టెంబరు 27, 2024

ఇక ప్రైవేటు మద్యం దుకాణాలు

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వాటి స్థానంలో ప్రైవేటు మద్యం దుకాణాలకు టెండర్లు పిలవనుంది. కర్నూలు జిల్లా కంటే నంద్యాల జిల్లాలోనే అధికంగా మద్యం దుకాణాలకు టెండర్లు జరగనున్నాయి. ఒకటిరెండు రోజుల్లో టెండర్ల ప్రక్రియ సంబంధించిన నోటిఫికేషన్ విడుదల కానుంది. దుకాణాలు దక్కించుకోవాలని ఆశిస్తున్న రాజకీయ నాయకులు, వ్యాపారులు ఎదురుచూస్తున్నారు. మరికొందరు టెండర్లు వేయకుండా రాజకీయ పలుకుబడిని కూడా ఉపయోగిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఎక్సైజ్ స్టేషన్లు	మద్యం దుకాణాలు
నంద్యాల	22
ఆత్మకూరు	9
నందికొట్కూరు	7
బనగానపల్లె	13
కోవెలకుంట్ల	12
ఆళ్లగడ్డ	18
డోన్	12

■ ప్రస్తుతం ఉన్న వాటికంటే 20 శాతం పెంపు
■ త్వరలో టెండర్లు పిలిచే అవకాశం

★ నంద్యాల జిల్లాలో ప్రస్తుతం 93 దుకాణాలు ఉన్నాయి. వాటిలో 20 శాతం పెంచి టెండర్లు పిలవనున్నారు. ప్రస్తుతం జిల్లాలో 22 బార్లు ఉన్నాయి. వీటిలో ఆత్మకూరు 1, ఆళ్లగడ్డ 1, నందికొట్కూరు 1, బనగానపల్లి 1, కోవెలకుంట్ల 1, డోన్ 2, నంద్యాలలో 15 ఉన్నాయి. నంద్యాల, నందికొట్కూరు, కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, బనగానపల్లి, డోన్‌లో ఎక్సైజ్ స్టేషన్లు ఉన్నాయి.

రాజకీయ జోక్యం

నంద్యాల జిల్లాలో మద్యం దుకాణాల టెండర్లు వేయక ముందే కొంతమంది రాజకీయ నాయకులు ఆ దుకాణం మాదే అని ప్రచారం చేసుకుంటున్నట్లు చర్చసాగుతోంది. ఇతరులు టెండరు వేసినా ఫలితం ఉండదని చెబుతున్నారు. మరికొందరు ఇతరుల పేర్ల మీద టెండర్లు వేసి ఎక్కువ దుకాణాలు సొంతం చేసుకోవాలని చూస్తున్నారు. దీంతో ఈసారి పెద్దఎత్తున టెండర్లు వేసే అవకాశం ఉంది.

గుడ్‌విల్‌వైపే మొగ్గు

మద్యం దుకాణానికి రీఫండబుల్ మొత్తం రూ.2 లక్షలు ఉంటుందని గుత్తేదారులు భావిస్తున్నారు. దీంతో లాటరీలో టెండర్ ఎవరికి వచ్చినా గుడ్‌విల్ ఇచ్చి దుకాణం దక్కించుకోవాలని చాలామంది ఆలోచిస్తున్నారు. నాణ్యమైన మద్యం సరఫరా చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో విక్రయాలు పెరిగే అవకాశం ఉందని గుత్తేదారులు భావిస్తున్నారు.


వాగు పొంగింది.. అవస్థలు మిగిల్చింది


పాలేరువాగును దాటుతున్న ద్విచక్ర వాహనచోదకులు

సంజామల, న్యూస్‌టుడే: అవుకు రిజర్వాయర్ కట్ట కొంతమేర కుంగడంతో రిజర్వాయర్ నుంచి అధికారులు పాలేరువాగుకు ఎక్కువగా నీటిని దిగువకు గురువారం వదలడంతో పలువురికి ఇబ్బందులు ఎదురయ్యాయి. పాలేరువాగు సంజామల, ఉయ్యాలవాడ మండలాల్లో ఎక్కువగా నీటి ప్రవాహంతో వందలాది ఎకరాల్లో వరి, మినుము, మొక్కజొన్న పంటలు నీట మునిగాయి. ఎకరాకు రూ.50 వేలకు పైగానే పెట్టుబడులు పెట్టి సాగు చేశామని, ఏటా పాలేరు వాగు పొంగడంతో ఇలా పంటలను నష్టపోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే ఒకసారి వరదల్లో పంటలు నీట మునిగి కొట్టుకుపోవటంతో మళ్లీ సాగుచేశామని, రెండోసారి కూడా ఇలా మునగడంతో అధికారులు తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పర్యాటకానికి ప్రగతి తోరణం

■ వంద రోజుల ప్రణాళిక తయారీ
■ అభివృద్ధికి ముందుకొచ్చిన కేంద్రం
■ నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం



నల్లమల అందాలు.. ఆధ్యాత్మిక క్షేత్రాలు.. చారిత్రక నిర్మాణాలకు నెలవైన ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యాటకులకు స్వర్గధామం. ఎన్నో దర్శనీయ స్థలాలున్నా గత వైకాపా ప్రభుత్వ విధానాలు పర్యటక ప్రగతికి సంకెళ్లుగా మారాయి.. ఆయా ప్రాంతాల్లో కనీసం మంచి నీటి సౌకర్యం కల్పించలేకపోయారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పర్యాటక ప్రగతికి తలుపులు తెరిచింది. గత ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన పర్యాటకరంగం ఇక చకచకా ముందడుగు వేయనుంది. కార్యరూపం దాలిస్తే.. స్థానికులకు ఉపాధి లభించడంతో పాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

–న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

పత్తికొండకు అండ

పత్తికొండ నియోజకవర్గంలోని తుగ్గలి మండలం జి.ఎర్రగుడి గ్రామ సమీపంలో అశోకుని శాసనాలు ఉన్న ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నారు. ఇందుకు రూ.కోటి ఖర్చు అయ్యే అవకాశం ఉందని లెక్కలేశారు. రెస్టారెంట్ నిర్మాణంతో పాటు ట్రెక్కింగ్‌కు ఏర్పాట్లు చేయనున్నారు. ఉద్యానవనాలను అభివృద్ధి చేయనున్నారు.

బనవాసి.. ఇక ఖుషీ

ఎమ్మిగనూరులోని బనవాసి ప్రాంతానికి పర్యాటక కళ తెచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఫుడ్‌కోర్టు నిర్మాణం, కిడ్స్ పార్కుతో పాటు ఆహ్లాదం కలిగే విధంగా వివిధ వసతి సౌకర్యాలు కల్పించనున్నారు. పర్యాటకులు సేద తీరే విధంగా రెస్టారెంట్లు, అమ్యూజ్‌మెంట్ పార్కును రూ.2 కోట్లతో తీర్చిదిద్దనున్నారు.

తుంగభద్ర అలలపై విహరించేలా

సుంకేసుల జలాశయంలో బోటింగ్‌తో పాటు పర్యాటక రెస్టారెంట్లు నెలకొల్పాలని ప్రతిపాదించారు. బోట్లలో పర్యాటకులు జలాశయం మొత్తం తిరిగొచ్చేలా ఏర్పాట్లు చేయనున్నారు. బనవాసి నుంచి సుంకేసుల వరకు పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు కానుంది.

ఓర్వకల్లుకు తీగ మార్గం

ఓర్వకల్లు రాక్ గార్డెన్స్‌లో ప్రస్తుతం పర్యాటకుల సందడి ఎక్కువగా ఉంటోంది. సమీపంలో విమానాశ్రయం ఉండటంతో ఇక్కడ పర్యాటకులకు అదనపు సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు ప్రతిపాదనలు చేస్తున్నారు. రోప్‌వే ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎక్కడి నుంచి ఎక్కడి వరకు ఏర్పాటు చేయాలనే విషయంపై పర్యాటక శాఖ అధికారులు ఆలోచిస్తున్నారు. ఆదిమానవుడు సంచరించిన కేతవరం కొండలనూ కలుపుతూ పర్యాటన నడవా ఏర్పాటు చేసే దిశలో ప్రయత్నాలు సాగుతున్నాయి.

పశ్చిమాన నవోదయం

✤ ఆదోని పట్టణ సమీపంలో రాంజల చెరువును రూ.2 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. చెరువులో బోటింగ్ సౌకర్యం కల్పించనున్నారు. రెస్టారెంట్ నిర్మాణంతో పాటు ఉద్యానవనాన్ని తీర్చిదిద్దనున్నారు.

✤ ఆదోని సమీపంలోని పెద్ద తుంబళం శివార్లలోని జైన్ ఆలయాన్ని రూ.3 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. ఇక్కడ ఫుడ్ కోర్టుతోపాటు పార్కును ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించారు.

✤ గాజులదిన్నె జలాశయం వద్ద రెస్టారెంట్ నిర్మాణంతో పాటు బోటింగ్ సౌకర్యం కల్పించనున్నారు. పార్కు, ఆట పరికరాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

ఒక్కరోజులోనే నవనందులను చూసేలా

నంద్యాల చుట్టు పక్కల 15 కి.మీల పరిధిలో ఉన్న నవనంది క్షేత్రాలను దర్శించే విధంగా ప్రత్యేక పర్యాటక మార్గాలను ఏర్పాటు చేయనున్నారు. ఆయా క్షేత్రాలకు ప్రత్యేక బస్సులను తిప్పనున్నారు. ఒకేరోజు అన్ని ఆలయాలు సందర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఆలయాల వద్ద ప్రత్యేకంగా బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.

శ్రీగిరికి కొత్త శోభ

● సంగమేశ్వరం- శ్రీశైలం మధ్య ప్రత్యేక నడవాను తీర్చిదిద్దనున్నారు. సంగమేశ్వరం వద్ద త్వరలో బీగల వంతెన నిర్మాణం ప్రారంభం కానుంది. దీన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దనున్నారు. ఇక్కడి నుంచి శ్రీశైలానికి జల మార్గంలో వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కారిడార్ అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు హామీ కూడా ఇచ్చారు. త్వరలో నిధుల కేటాయింపు జరగనుంది. ఇక్కడి నుంచే సరస్వతి నిలయమైన కొలనుభారతిని వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.

● శ్రీశైలం సమీపంలోని ఇష్టకామేశ్వరి ఆలయం, శివాజీ స్ఫూర్తి కేంద్రం, పాలధార, పంచధార ప్రదేశాల్లో ఒకచోట ట్రెక్కింగ్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.

● శ్రీశైలంలో మరో రోప్‌వే ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్- తెలంగాణ రాష్ట్రాల మధ్య సంప్రదింపులు జరుగుతున్నాయి. రుద్ర పార్కు నుంచి దోమల పెంట, ఈగల పెంట వరకు రోప్‌వే ఏర్పాటుకు అటు అటవీ శాఖ అధికారులతో చర్చిస్తున్నారు. ఇక్కడ పార్కింగ్, వసతికి రెండెకరాలు సేకరించాలని నిర్ణయించారు.

వచ్చిన పర్యాటకుల సంఖ్య ఏడాది	నంద్యాల	కర్నూలు
2022-23	1,21,32,623	1,41,24,011
2023-24	1,29,26,768	1,56,95,568

అహోబిలం.. ఆధ్యాత్మికం.. ఆహ్లాదం

ఛాలెంజ్-2 పథకం కింద అహోబిలంలో రోప్‌వే ఏర్పాటుకు కేంద్రం గతంలోనే అంగీకరించింది. వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ముందుకు సాగలేదు. ఎగువ, దిగువ అహోబిలాల్లో రోప్‌వే ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయమై ప్రభుత్వం సర్వే చేయనున్నారు.

నవాబు ఖిల్లా.. ఇక కళకళ

★ బనగానపల్లి సమీపంలోని నవాబుల కోటను సుందరంగా తీర్చిదిద్ది ఇక్కడ సౌండ్ అండ్ లైట్ షో ఏర్పాటు చేయనున్నారు.

★ బెలుం గుహలతో పాటు యాగంటి క్షేత్రానికి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారు. ఈ రెండింటి మార్గంలో ఉన్న నవాబుల కోటను అభివృద్ధి చేయాలనే ప్రతిపాదన కూటమి ప్రభుత్వం ముందుంది.

వాల్మీకి గుహలకు మార్గం

ప్యాపిలి సమీపంలో వాల్మీకి గుహలు, బేతంచెర్లలో బిల్వ గుహలు చూసేందుకు వెళ్లే పర్యాటలకు సంఖ్య పెరిగింది. ఇప్పటికే ఈ గుహలతో పాటు మద్దిలేటి స్వామి క్షేత్రాన్ని సందర్శించే విధంగా ప్రత్యేకంగా రవాణా సౌకర్యాలను కల్పించారు. సెలవు దినాల్లో ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ఆధ్యాత్మిక క్షేత్రాలతో పాటు పర్యాటక ప్రాంతాలను ఎక్కువ మంది సందర్శించే విధంగా ఈ మార్గంలో మరిన్ని ఆర్టీసీ బస్సులు తిప్పాలని భావిస్తున్నారు.


అవుకు జలాశయంవద్ద కుంగినరాతి కట్టను పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

అవుకు జలాశయంలో నీటి నిల్వ తగ్గింపు

■ కట్ట కుంగడంతో అధికారుల చర్యలు

అవుకు, న్యూస్‌టుడే: అవుకు జలాశయానికి ఎలాంటి ప్రమాదం లేదు.. కట్ట కుంగిన చోట సమస్యకు శాశ్వత పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని జలవనరుల శాఖ సీఈ కబీర్‌బాష పేర్కొన్నారు. తిమ్మరాజు రాతి కట్టడం కుంగిన నేపథ్యంలో ఆయన అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఎగువ భాగంలో రివిట్‌మెట్ రాళ్లు కుంగడంతో సమస్య తలెత్తిందని.. జలాశయం నిర్మాణానికి పూర్వం ఉన్న చెరువు కట్ట తూము విషయంలో సమస్య ఉండేది.. గతంలోనే గుర్తించి గ్రౌటింగ్ పద్ధతిలో మరమ్మతులు చేశాం.. ప్రస్తుతం నీటిమట్టం పెరగడంతో కట్టపై ఉన్న మట్టి కరిగి సమస్య నెలకొందని వివరించారు. వేసవిలో సమగ్ర పరిశీలన చేసి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. ప్రస్తుతం జలాశయంలో 4.14 టీఎంసీల నీరు నిల్వ ఉంది.. 3.5 టీఎంసీలకు తగ్గించే ఏర్పాట్లు చేశాం.. ఇందులో భాగంగా గాలేరు-నగరి కాల్వ ద్వారా వైఎస్సార్ జిల్లా గండికోట జలాశయానికి 12 వేల క్యూసెక్కులు తరలిస్తున్నామన్నారు.

తెగుతున్న కట్టలు.. మునుగుతున్న పంటలు

■ తెలుగు గంగ రైతుల గోడు

కళ్లెదుట నీరున్నా చేనుకు చేరని పరిస్థితి నెలకొంది.. తెలుగు గంగ ఆళ్లగడ్డ నియోజకవర్గ వాసుల జీవనాడి.. గత కొంతకాలంగా నిర్వహణ లేక ఓ వైపు కాల్వలకు గండ్లు పడి నీరంతా వృథా అవుతోంది.. మరో వైపు పంట కాల్వల నిర్మాణం జరగ్గా నీరు అందడం లేదు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 78 వేల ఎకరాలకు తెలుగు గంగ నీరు అందాల్సి ఉంది. కాల్వలు సరిగా లేకపోవడంతో చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదు. 0 కి.మీ నుంచి 18.20 కి.మీ వరకు, 18 కి.మీ నుంచి 42.566 కి.మీ వరకు రూ.239.03 కోట్లతో ప్రధాన కాల్వ లైనింగ్ పనులు చేపట్టారు. ప్రధాన కాల్వ పొడవునా ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలోని రుద్రవరం, చాగలమర్రి మండలాల్లో డిస్ట్రిబ్యూటరీ పనులు చేశారు. నాణ్యత సరిగా చేపట్టక పోవడంతో ఎక్కడికక్కడ తెగిపోతున్నాయి.

ఆళ్లగడ్డ, రుద్రవరం, న్యూస్‌టుడే:

శ్రీరంగాపురంలోనూ

శ్రీరంగాపురం వద్ద 17వ బ్లాక్‌లోని మైనర్ కాల్వకు కొన్ని వారాల కిందట గండి పడింది. ఇక్కడ గండిని రైతులే చందాలు వేసి పూడ్చారు. ఈ నెల 6న చాగలమర్రి పరిధిలో చిన్నవంగలి వద్ద మల్లారెడ్డి కుంటకు గండి పడింది. పంటలు నీటమునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. 2020లోనూ ఈ చెరువు కట్టకు గండి పడగా, మళ్లీ అదే చెరువుకు ఇటీవల గండి పడటంతో 200 ఎకరాల్లో పంట నీట మునిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పనపల్లె, గోనంపల్లె, కొండమాయపల్లె గ్రామాల పరిధిలో మొక్కజొన్న, పత్తి, మినుము సాగు చేసుకుంటున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో నీళ్లు లేకున్నా ఫర్వాలేదని, రాబోయే రోజుల్లో వర్షాలు కురవకపోతే పంటల పరిస్థితి ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.


తెగిన తెలుగు గంగ మైనర్ కాల్వ

19వ బ్లాక్ మైనర్ కాల్వకు

రుద్రవరం పరిధిలోని 19వ బ్లాక్ మైనర్ కాల్వకు గత నెల 4న గండి పడటంతో నీరంతా వృథాగా పోయింది. నెలన్నర దాటినా అధికారులు పూడ్చలేదు. అప్పనపల్లె వద్ద మేజరు కాల్వ నుంచి నీటిని ఎక్కువగా విడుదల చేయడంతో ఒత్తిళ్లను తట్టుకోలేక కాల్వ తెగిందని అధికారులు చెబుతున్నారు. రుద్రవరం పరిధిలో తెలుగు గంగ కాల్వలకు గండ్లు పడటం ఇదేమీ తొలిసారి కాదు. గతంలోనూ పలుమార్లు తెగడం, వారాల పాటు నీళ్లు వృథా అవ్వడం, వందల ఎకరాల్లో పంట భూములు నీళ్లలో మునగడం, నీళ్లు అందక అదేస్థాయిలో పంటలు ఎండిపోవడం జరిగేది. కాల్వ కట్టల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతోనే ఈ సమస్య ఎదురవుతోందని రైతులు వాపోతున్నారు. కాల్వపై క్షేత్రస్థాయిలో సిబ్బందితో పర్యవేక్షణ సక్రమంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంది.

సహకార సంఘాలకు పన్నుపోటు



■ వెంటనే చెల్లించాలని తాఖీదులు
■ గత పాలనలో పీఏసీఎస్‌లు నిర్వీర్యం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: పన్ను బకాయిలు చెల్లించాలంటూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్‌లు)కు ఆదాయ పన్ను శాఖ తాఖీదులు జారీ చేయడం కలకలం రేపుతోంది. వార్షిక టర్నోవర్ రూ.కోటి దాటిన 62 సంఘాలకు వీటిని జారీ చేశారు. రూ.30 కోట్ల వరకు బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్ సీజన్లో 6.50 లక్షల హెక్టార్లలో పంటలు సాగు చేస్తున్నారు. నంద్యాలలో 54, కర్నూలులో 45 వరకు పీఏసీఎస్‌లు ఉన్నాయి. ఏటా ఒక్కో రైతుకు రూ.20 వేల నుంచి గరిష్ఠంగా రూ.3 లక్షల వరకు రుణాలు ఇస్తుంటాయి. వీటికి 2018-19 ఆర్థిక సంవత్సరంలో పాన్ కార్డులు జారీ అయ్యాయి. అప్పటి నుంచి ఆయా సంఘాల్లో జరిగే ఆర్థిక లావాదేవీలన్నీ అధికారికంగా నమోదవుతున్నాయి. ఆయా సంఘాల వార్షిక టర్నోవర్‌పై ఏటా నివేదిక అందించాలి. గత ఐదేళ్ల వైకాపా పాలనలో సంఘాలను నిర్వీర్యం చేశారు. ఆ పార్టీ నేతలంతా పెత్తనం చేసి రుణాలు తీసుకొన్నారు.. తిరిగి చెల్లించలేదు. అధికారులూ పట్టించుకోలేదు. ఇదే సమయంలో పెత్తఎత్తున నిధులు గోల్‌మాల్ అయ్యాయి. పన్ను చెల్లించాలంటూ ఏటా ఆదాయ పన్ను శాఖ తాఖీదులు ఇస్తున్నా పట్టించుకోలేదు.. గత ప్రభుత్వ విధానాల కారణంగా కొన్ని పీఏసీఎస్‌ల మనుగడ ఇప్పటికే ప్రశ్నార్థకంగా మారింది. తాజాగా ఆదాయపు పన్ను శాఖ తాఖీదులు ఇవ్వడం కలవరం రేపుతోంది. నోటీసులు అందుకున్న సంఘాల్లో ఎక్కువ భాగం ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, కోడుమూరు, ఆళ్లగడ్డ, శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లోనే ఉన్నాయి. ఈ విషయాన్ని సంబంధిత శాఖాధికారులు గుట్టుగా ఉంచుతున్నారు. గత ఐదేళ్లు పట్టించుకోకపోవడంతో బకాయిలు కొండలా పెరిగాయి.. వాటిని ఒకేసారి చెల్లించాల్సి రావడంతో అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంలో పెద్దన్న పాత్ర పోషించాల్సిన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) తనకేమి పట్టనట్లుగా వ్యవహరించడం గమనార్హం.


పలుకూరు సమీపంలో చెరువును తలపిస్తున్న నాపరాళ్ల గని

నీరు నిండింది.. ఉపాధికి గండిపడింది

ఆగిన ఉత్పత్తి

పలుకూరు, రామకృష్ణాపురం, చెర్లోపల్లె, రామాపురం, బెలుం, అంకిరెడ్డిపల్లె, కనకాద్రిపల్లె, మీర్జాపురం గ్రామాల్లో నాపరాతి గనులు ఉన్నాయి. 950 హెక్టార్లలో నాపరాతి గనులు విస్తరించి ఉండగా, వర్షాలకు సుమారు 300 హెక్టార్ల మేర గనుల్లో నీరు చేరినట్లు గుర్తించారు. ఫలితంగా ఉత్పత్తి ఆపేశారు. నియోజవర్గంలో నిత్యం రూ.30 లక్షల విలువ చేసే రాయిని ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. అలాంటిది నేడు సగానికి పైగా రవాణా తగ్గిపోయింది. నెలకు రూ.9 కోట్లకు పైగా వ్యాపారా లావాదేవీలు జరిగేవి.. ఈ లెక్కన ఏడాదికి రూ.100 కోట్లకు పైగా నాపరాతి పరిశ్రమ కాంతులీనేది.. ఇటీవల వర్షాలకు అంతా కుదేలయ్యాం.. అన్ని రకాలుగా కష్టాలు ఎదురయ్యాయని గని యజమాని ఒకరు న్యూస్‌టుడే'తో వాపోయారు.

బనగానపల్లి, న్యూస్‌టుడే: ఎక్కడైనా జలం ఉంటే జనానికి ఉపాధి దొరుకుతుంది.. బనగానపల్లి నియోజకవర్గంలో మాత్రం 'నీరు' ఉపాధికి గండి పెడుతోంది.. వినడానికి విచిత్రంగా ఉన్నా అదే నిజం.. సమస్యలోకి వెళ్తే నియోజకవర్గంలో వ్యవసాయ రంగం తర్వాత ఎక్కువ మంది నాపరాతి గనుల ఆధారిత పరిశ్రమలపై ఆధారపడి బతుకు బండిని లాగిస్తుంటారు. ఈ పరిశ్రమను నమ్ముకొని సుమారు 20 వేలకు పైగా కుటుంబాలు జీవిస్తున్నాయి. గతంలో ఎన్నడూలేనివిధంగా బనగానపల్లి నియోజకవర్గంలో ఈసారి భారీ వర్షాలు కురిశాయి.. ఫలితంగా గనుల్లోకి నీరు చేరింది.. రాళ్లను వెలికితీయడం నిర్వాహకులకు కష్టంగా మారడంతో పనులు ఆపేశారు. రాళ్లు తీసే కార్మికులు, వాటిని తరలించే వాహనాదారులు, పాలిషింగ్ చేసే కూలీలకు పనిలేకుండా పోయింది. గనుల్లో పనులు జరిగితే నిత్యం ఒక్కో వ్యక్తి రూ.500 నుంచి రూ.1000 వరకు సంపాదిస్తారు.. ప్రస్తుతం పనులు ఆగిపోవడంతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు.

గుంటూరు వెళ్లే పరిస్థితి

–లక్ష్మన్న, పలుకూరు

గతంలో ఎన్నడూ లేని విధంగా నాపరాతి గనుల్లో పనులు లేకపోయాయి. గనుల నిండా నీరు ఉండటంతో కూలీల అవసరం తగ్గిపోయింది. దీంతో కూలి పనికి గుంటూరుకు వలసలు వెళ్లే పరిస్థితి ఎదురైంది. గనుల్లో నీటిని ఎన్ని మోటార్లు పెట్టినా తొలగించలేకపోతున్నారు.

ఉత్పత్తులు తగ్గాయి

–రాజగోపాల్, గనుల శాఖ ఏడీ

గనుల్లో నీరు చేరడంతో నెల రోజులుగా నాపరాళ్ల ఉత్పత్తులు తగ్గాయి. గనుల శాఖకు కూడా ఆదాయం తగ్గింది. ఇతర ప్రాంతాలకు తరలించేటప్పుడు చెల్లించాల్సిన రాయల్టీ ఆదాయానికి గండిపడినట్లే.

నాపరాతి గనులు	నిత్యం వెలికితీత	ఒక్కో చదరపు రాయి	నిత్యం వచ్చే ఆదాయం	నీట మునిగిన గనులు
950 హెక్టార్లు	6000 చదరాలు	విలువ: రూ.500	రూ.30 లక్షలు	300 హెక్టార్లు


పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా

మహిళలపై దాడులను కట్టడి చేయాలి

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : మహిళపై దాడులు, అఘాయిత్యాల కట్టడికి సత్వరం చర్యలు తీసుకోవాలని ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా పోలీసు అధికారులను ఆదేశించారు. నంద్యాల పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఆయన నంద్యాల సబ్ డివిజన్‌కు సంబంధించిన నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తప్పిపోయిన బాలురు, బాలికల ఆచూకీ త్వరగా గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించాలన్నారు. నంద్యాల డీఎస్పీ యుగంధర్‌బాబు, సీఐలు మోహన్‌రెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, ఆదినారాయణ, ప్రియతంరెడ్డి పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు చర్యలు

జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు గత ఐదు రోజులుగా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా తెలిపారు. తాగి వాహనాలు నడుపుతున్న 92 మందిపై కేసులు నమోదు చేసి 64 వాహనాలు సీజ్ చేసినట్లు వెల్లడించారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తున్న 240 మందిపై కేసులు నమోదు చేసి రూ.21,280 జరిమానా విధించామన్నారు. మోటారు వాహనాల చట్టాన్ని ఉల్లంఘించిన 2,332 మందిపై కేసులు నమోదు చేసి రూ.10.77 లక్షలు జరిమానా వేశామన్నారు. ఆరు జూదం కేసుల్లో 48 మందిని అరెస్టు చేసి రూ.1.21 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నాటుసారా అమ్మేవారిపై 33 కేసులు నమోదు చేసి 165 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

తోడబుట్టారు.. పతకాలు చేపట్టారు

☛ మార్షల్ ఆటలో రాణిస్తున్న అక్కాతమ్ముడు

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: పిల్లల ఆసక్తిని గమనించి.. తల్లి దండ్రులు ప్రోత్సహించారు. నచ్చిన ఆటపై పట్టు సాధించి.. పతకాలు సాధిస్తున్నారు ఆ అక్కాతమ్ముడు.

వినయశ్రీ, దేవాన్ష్



మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలంటే కఠోర సాధన తప్పనిసరి. రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని తమ పంచ్‌లతో పతకాలు ఒడిసిపడుతున్నారు.

ఆదోని పట్టణానికి చెందిన ఫొటోగ్రాఫర్ వెంకటరమణ దంపతులు కుమార్తె ఎన్.వినయశ్రీ, కుమారుడు ఎన్.దేవాన్ష్ మార్షల్ ఆర్ట్స్ పుంసే క్రీడలో ప్రతిభ చాటుతున్నారు. వినయశ్రీ ఎనిమిది, దేవాన్ష్ ఏడో తరగతి చదువుతున్నారు. ఓ వైపు చదువుతూనే మరో వైపు ఆదోని పట్టణానికి చెందిన మాస్టర్ దాదాబాషా వద్ద మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతున్నారు. మూడేళ్లుగా పోటీల్లో పాల్గొంటూ పతకాలు సాధిస్తున్నారు.

ప్రతిభకు బంగారు పతకం

అక్కాతమ్ముడు వినయశ్రీ, దేవాన్ష్ మార్షల్ ఆర్ట్స్ క్రీడల్లో రాణిస్తూ.. బ్లాక్ బెల్ట్ సొంతం చేసుకున్నారు. ఈ నెల 15వ తేదీన కడపలో మార్షల్ ఆర్ట్స్ పుంసే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ఇద్దరూ బంగారు పతకాలు సొంతం చేసుకున్నారు. గత నెల తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండు విభాగాల్లో వినయశ్రీ బంగారు, వెండి పతకాలు సాధించగా.. దేవాన్ష్ రెండు బంగారు పతకాలు సొంతం చేసుకున్నాడు. ఇప్పటి వరకు పదుల సంఖ్యలో పతకాలు సాధించి శభాష్ అనిపించుకుంటున్నారు. చదువులోనూ ఉన్నత స్థాయికి ఎదగడమే తమ లక్ష్యమని చెబుతున్నారు ఈ ఇద్దరు అక్కాతమ్ముడు.

మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తే సహించం

డోన్, న్యూస్‌టుడే: హిందూ మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తే సహించమని నాయకులు ర్యాలీలో నిరసన తెలిపారు. తిరుపతి ప్రసాదం కల్తీ ఘటనను నిరసిస్తూ హిందూ ఆధ్యాత్మిక సంఘాల మద్దతుతో గురువారం వివేకానంద విగ్రహం నుంచి పాతబస్టాండ్ మీదుగా డీఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. డీఎస్పీ కార్యాలయంలో ఎస్సైకు వినతిపత్రం అందజేశారు. నాయకులు బ్రహ్మం, వడ్డేమహరాజ్, బ్రాహ్మణసంఘం ఉపాధ్యక్షుడు శేషావలి శర్మ మాట్లాడారు. హిందూ సంప్రదాయలను గౌరవించకుండా ప్రసాదాలను కల్తీ చేయడం బాధాకరమన్నారు. ప్రసాద్, పుల్లయ్య మధునాయుడు, మౌలాలి, గణేష్, వీరయ్య, ఆర్మీరామయ్య, పవన్‌కుమార్‌రెడ్డి, మద్దిలేటి పాల్గొన్నారు.

వైకాపా పాపం.. రాతి వనాలకు శాపం

ఓర్వకల్లు సమీపంలో ఉన్న రాక్ గార్డెన్ (రాతి వనాలు)ను గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. అప్పట్లో దీని ప్రాధాన్యాన్ని గుర్తించిన తెదేపా ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయించింది. పర్యాటకులను ఆకట్టుకునేలా పలు సౌకర్యాలు కల్పించింది. హరిత రెస్టారెంటు ఏర్పాటుచేసింది. ఫలితంగా ప్రతిరోజూ వందల సంఖ్యలో జనం వచ్చేవారు. పర్యాటక శాఖకు ఆదాయం సమకూరేది. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో రాతి వనం అధ్వాన స్థితికి చేరింది. ఆ ప్రాంతంలో ఏర్పాటుచేసిన ఆట వస్తువులు శిథిలావస్థకు చేరాయి. నీటి ఫౌంటెన్ అధ్వాన స్థితికి చేరింది. పర్యాటకుల సంఖ్య సైతం పడిపోయింది.

\- ఈనాడు, కర్నూలు



బురదమయంగా రహదారి




అధ్వాన స్థితికి చేరిన హరిత రెస్టారెంట్



నీటి ఫౌంటెన్‌లో మురుగునీరు



పిల్లల పార్కులో శిథిలావస్థకు చేరిన ఆట వస్తువులు



రాతి వనాల మధ్య వసతిగృహాలు

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సఖి వన్ స్టాప్ కేంద్రంలో ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి, సాధికారత అధికారిణి లీలావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్‌లో అభ్యర్థులెవరూ క్వాలిఫై కాకపోవడంతో దానిని రద్దు చేసినట్లు వెల్లడించారు. అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. సెంటర్ అడ్మినిస్ట్రేటర్, కేసు వర్కర్, పారాలీగల్ పర్సనల్, సోషల్ కౌన్సిలర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. పూర్తి వివరాలకు నంద్యాల్.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను పరిశీలించాలన్నారు.

డీఈకి శ్రీముఖం జారీ

అవుకు, న్యూస్‌టుడే: విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలపై అవుకు జలాశయం డీఈ కొండన్నపై జలవనరుల శాఖ ఎస్ఈ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనకు గురువారం మెమో ఇచ్చారు. జలాశయం రాతి కట్ట కుంగిన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాల్సిన అధికారి బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినట్లు విమర్శలు ఉన్నాయి. ప్రజలు, పాత్రికేయులకు కనీస సమాచారం ఇవ్వకుండా దురుసుగా ప్రవర్తించాడనే ఆరోపణలు ఉన్నాయి.

ఎట్టకేలకు జాబితా ఖరారు

☛ 42 మంది ఎంపీడీవోలకు స్థానచలనం
☛ పంతం నెగ్గించుకున్న జడ్పీ సీఈవో

కర్నూలు జడ్పీ, న్యూస్‌టుడే : ఎట్టకేలకు ఎంపీడీవోల బదిలీల జాబితా ఖరారైంది. రెండు రోజుల కిందట జడ్పీ ఛైర్మన్, సీఈవో వేర్వేరుగా బదిలీల జాబితా విడుదల చేయడం వివాదాస్పదమైంది. అసలేం జరుగుతోందో ఎవరికీ అర్థం కాని పరిస్థితి. ఈ నేపథ్యంలో తాజాగా 42 మంది ఎంపీడీవోలను బదిలీ చేస్తూ సీఈవో నాసరరెడ్డి గురువారం జాబితా విడుదల చేశారు. గతంలో వైకాపా నేతలకు అండగా ఉన్న కొందరు ఎంపీడీవోలకు అనుకున్న స్థానాలు లభించగా.. ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు ఇచ్చినా ఫలితం దక్కలేదని మరికొందరు ఆవేదన చెందుతున్నారు.

ఎడమొహం.. పెడమొహం: బదిలీల్లో నెలకొన్న విభేదాల నేపథ్యంలో జడ్పీ ఛైర్మన్ పాపిరెడ్డి, సీఈవో నాసరరెడ్డి గత మూడు రోజులుగా ఎడమొహం పెడమొహంగా ఉన్నారు. నగరంలోని జడ్పీ కార్యాలయానికి ఛైర్మన్ పాపిరెడ్డి గురువారం మధ్యాహ్నం వచ్చారు. కాగా బదిలీలకు సంబంధించిన అంశంపై ఛైర్మన్‌ను సీఈవో సంప్రదించకపోవడంతో వీరిద్దరి మధ్య అంతరం మరింత పెరిగిందని జడ్పీ కార్యాలయ ఉద్యోగులు పేర్కొంటున్నారు.

● ఉమ్మడి జిల్లాలో 42 మంది ఎంపీడీవోలను బదిలీ చేస్తూ జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి 23వ తేదీ రాత్రి విడుదల చేసిన జాబితాను గురువారం మరోసారి అధికారికంగా ధ్రువీకరించారు. బదిలీ ఉత్తర్వులను వచ్చే నెల 1న ఇస్తామని.. వీరందరూ 2వ తేదీన విధుల నుంచి రిలీవ్ కావాల్సి ఉంటుందని సీఈవో నాసరరెడ్డి చెప్పారు. ఇదే తుది జాబితా అని స్పష్టం చేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ ప్రదేశం
డి.సుబ్రహ్మణ్యశర్మ	వైఎస్సార్ జిల్లా	నందికొట్కూరు
కె.వరప్రసాదరావు		కోవెలకుంట్ల
ఎన్.భాగ్యలక్ష్మి	"	రుద్రవరం
ఎన్‌సీహెచ్ వాసుదేవగుప్తా	బండి ఆత్మకూరు	గడివేముల
వెంగన్న	బేతంచెర్ల	కొలిమిగుండ్ల
మహ్మద్‌దౌలా	చాగలమర్రి	మహానంది
ఎ.శ్రీనివాసరావు	గడివేముల	ప్యాపిలి
ఎంజీ ప్రవీణ్‌కుమార్	గోనెగండ్ల	పాణ్యం
మంజులవాణి	జూపాడుబంగ్లా	చాగలమర్రి
ఎన్.చంద్రశేఖర్	కోడుమూరు	పాములపాడు
దశరథరామయ్య	నందవరం	మిడుతూరు
జి.వెంకటేశ్వరరెడ్డి	అవుకు	డోన్
బి.వి.రమణ	పగిడ్యాల	బనగానపల్లి
డి.గోపికృష్ణ	పాములపాడు	జూపాడుబంగ్లా
మూలింటి దస్తగిరి	పాణ్యం	బండి ఆత్మకూరు
ఎం.కవిత	పత్తికొండ	పగిడ్యాల
ఫజుల్ రహమాన్	ప్యాపిలి	బేతంచెర్ల
పి.మధుసూదన్‌రెడ్డి	రుద్రవరం	వెలుగోడు
కె.వి.సుబ్రహ్మణ్యం	శిరివెళ్ల	ఆత్మకూరు
కె.సావిత్రి	తుగ్గలి	దొర్నిపాడు
సి.శివమల్లేశప్ప	వెల్దుర్తి	శిరువెళ్ల
సోలోమన్	అనంతపురం జిల్లా	సంజామల

జలవనరుల శాఖలో కదిలిన పీఠాలు

☛ రెడ్డి శేఖర్‌రెడ్డి అనంతపురానికి బదిలీ ☛ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే: జలవనరులశాఖలో ఈఈల బదిలీలు జరిగాయి. ఈ మేరకు ఆ శాఖ ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

● కేసీ కాల్వ ఈఈగా ప్రతాప్‌ను నియమించారు. ఆయన అనంతపురం జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు.

● కర్నూలు సర్కిల్ కార్యాలయం డిప్యూటీ ఎస్ఈగా వైఎస్సార్ జిల్లాలో పని చేస్తున్న బాలచంద్రారెడ్డిని నియమించారు.

● కర్నూలు ఎంఐ ఈఈ రెడ్డి శేఖర్‌రెడ్డిని అనంతపురం జిల్లాకు బదిలీ చేశారు. ఈయన గత రెండేళ్లుగా కర్నూలు ఎస్ఈగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన స్థానంలో శ్రీశైలం డ్యాం ఈఈ జి.శ్రీనివాసులును నియమించారు.

● ఎల్లెల్సీ ఈఈగా పురుషోత్తపట్నంలో విధులు నిర్వహిస్తున్న పాండురంగయ్యను నియమించారు. ఆయన గతంలో హంద్రీనీవా ప్రాజెక్టు కర్నూలు ఈఈగా పని చేశారు.

● కర్నూలు సీఈ కార్యాలయం ఉప సీఈ లక్ష్మానాయక్‌ను శ్రీశైలం ప్రాజెక్టు డిప్యూటీ ఎస్ఈగా నియమించారు. విజయవాడకు చెందిన మల్లికార్జునను శ్రీశైలం ప్రాజెక్టుకు బదిలీ చేశారు.

● ఎస్సార్బీసీ సర్కిల్-1లో పని చేస్తున్న రాజేంద్రప్రసాద్‌ను కర్నూలు డిప్యూటీ సీఈగా నియమించారు.

● నంద్యాల ఎస్సార్బీసీ-2 డివిజన్ ఈఈ ఎల్ఎన్ వరప్రసాద్‌ను అదే సర్కిల్‌లో డిప్యూటీ ఎస్ఈగా నియమించారు.

మతసామరస్యం.. ఎల్లార్తి దర్గా రహస్యం..!

హాలహర్వి, హొళగుంద, న్యూస్‌టుడే : జిల్లాలో మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఎల్లార్తి షేక్షావలి, షాషావలి సాహెబ్‌ల ఉరుసు ఉత్సవాలు ఈ నెల 29న ప్రారంభం అవుతున్నాయి. దీంతో ముందుగానే దర్గాలను ముస్తాబు చేస్తున్నారు. గంధంతో మొదటి రోజు ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. ఈ ఉరుసులో పాల్గొనడానికి తెలుగు రాష్ట్రాలతో పాటుగా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. ఏటా ఎంతో విశిష్టంగా నిర్వహించే ఉరుసుపై ప్రత్యేక కథనం

దర్గాల చరిత్ర..

సుమారు 400 ఏళ్ల క్రితం అరబ్ దేశానికి చెందిన షేక్షావలి, షాషావలి సాహెబ్‌లు యూనాని వైద్యంలో సేవలందించడానికి భారత్‌లోని గుల్బర్గాకు వచ్చినట్లు భక్తుల నమ్మకం. అక్కడి నుంచి వైద్యం చేస్తూ ఎల్లార్తి గ్రామానికి చేరుకున్నట్లు పెద్దలు చెబుతారు. తమ మహిమలతో దీర్ఘకాల రోగాలను సైతం నయం చేస్తూ భక్తుల్లో ఎనలేని విశ్వాసాన్ని పొందారు. సాహెబ్‌ల వైద్యం, సందేశాలతో ప్రభావితులైన భక్తులు షేక్షావలి, పాషావలి, సాహెబ్‌ల దర్గాలను నిర్మించారు. ఈ దర్గాలకు ప్రతి గురు, శుక్రవారాలతో పాటు అమావాస్య రోజు భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటుంటారు. కన్నడ భాషలో 'ఎల్లా' అంటే అందరూ అని, 'ఆర్తి' అంటే బాధలో ఉన్న వారు (ఆర్థులు) అని అర్థం. క్రమేణా ఇదే గ్రామ నామంగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు.

ఉరుసు జరిగే తేదీలివే..

- సెప్టెంబరు 29 (ఆదివారం) గంధం
- సెప్టెంబరు 30 (సోమవారం) ఉరుసు
- అక్టోబరు 1 (మంగళవారం) జియారత్ కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయి.

గంధం ఇలా జరుగుతుంది..

వేలాది మంది భక్తుల మధ్య ఆదివారం రాత్రి సాహెబ్‌ల గంధాన్ని ఊరేగింపుగా దర్గాలకు తీసుకొస్తారు. దర్గాలకు చేరుకున్న గంధాన్ని ప్రత్యేక ప్రార్థనల అనంతరం భక్తులకు అందజేస్తారు. ఈ కార్యక్రమం వక్ఫ్ బోర్డు అధికారులు, స్థానిక భక్తుల పర్యవేక్షణలో జరుగుతుంది.



షేక్షావలి సాహెబ్ దర్గా ముఖద్వారం

ఎల్లార్తికి ఇలా చేరుకోవచ్చు

జిల్లా కేంద్రానికి సుమారు 130 కి.మీ., హొళగుంద నుంచి 9 కి.మీ., ఆలూరు నుంచి 17 కి.మీ. దూరంలో ఎల్లార్తి గ్రామం ఉంటుంది. హొళగుంద మార్గం నుంచి కర్ణాటక, ఆదోని ప్రాంతాల భక్తులు చేరుకోవచ్చు. ఆలూరు మార్గంలో కోడుమూరు, పత్తికొండ, గుంతకల్, అనంతపూర్ ప్రాంతాల నుంచి భక్తులు రావచ్చు. ఆదోని, పత్తికొండ, బనగానపల్లె తదితర ఆర్టీసీ డిపోల నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయి. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి, శిరుగుప్ప ప్రాంతాల నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయి. భక్తులకు ఇబ్బందులు కలగకుండా దర్గాలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈవో ఇమ్రాన్ తెలిపారు. వేలాది భక్తులు రానుండటంతో గ్రామంలో పారిశుద్ధ్యం లోపించకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు ఎల్లార్తి గ్రామ సర్పంచు చాముండేశ్వరి వెల్లడించారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.4 కోట్లు



హుండీ కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది, శివ సేవకులు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలోని చంద్రావతి కల్యాణ మండపంలో గురువారం భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్ల ఉభయ ఆలయాల హుండీ లెక్కింపు నిర్వహించారు. భక్తులు సమర్పించిన నగదు కానుకల ద్వారా రూ. 4,00,65,375 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం ఈవో డి.పెద్దిరాజు తెలిపారు. నగదుతో పాటు పలు విదేశీ కరెన్సీని కానుకలుగా సమర్పించారన్నారు.

పొలంలో ఏర్పడిన సొరంగం

ఎంబాయి(బేతంచెర్ల),న్యూస్‌టుడే: బేతంచెర్ల మండలం ఎంబాయి సమీపంలో బోగేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే దారిలో ఓ రైతు పొలంలో పెద్ద సొరంగం బయట పడింది. గ్రామానికి చెందిన ఆల శేఖర్ తన పొలంలో మామిడి మొద్దులను తొలగిస్తుండగా పెద్ద సొరంగం బయట పడింది. సమీపంలోని పొలం రైతులకు చూపించడంతో ఎన్నడూ చూడని గుహలను ఇప్పుడే చూస్తున్నామని అందరూ ఆశ్చర్యపోయారు. నలుగురు వ్యక్తులు ధైర్యం చేసి టార్చిలైటు సాయంతో 140 అడుగుల దూరం లోపలికి వెళ్లి చూసి వచ్చారు. సొరంగం సుమారు 160 నుంచి 200 అడుగుల పొడవు ఉండొచ్చునని ఆలా రాజప్ప, వెంకటరమణయ్య శెట్టి, కిరణ్, పొలం రైతు ఆలా శేఖర్ తదితరులు లోపలకు వెళ్లి సొరంగాన్ని చూసి వచ్చినట్లు తెలిపారు. దీన్ని పూడ్చాలంటే సుమారు 500 నుంచి 600 లారీల మట్టి పట్టవచ్చని చెబుతున్నారు. విషయం తెలుసుకున్న అగ్రికల్చర్ అసిస్టెంట్ పొలంలో ఏర్పడిన సొరంగాన్ని పరిశీలించి అధికారులకు సమాచారం ఇస్తామని తెలిపారు.



సొరంగాన్ని పరిశీలిస్తున్న రైతులు

వంతెన నియంత్రికను ఢీకొని లారీ దగ్ధం

☛ క్యాబిన్‌లో ఇరుక్కుని గంటసేపు డ్రైవర్ నరకయాతన

మద్దూరు(చాగలమర్రి), న్యూస్‌టుడే: మద్దూరు గ్రామ సమీపంలో 40వ జాతీయ రహదారిపైన గురువారం వేకువజామున వంతెనను లారీ ఢీకొనడంతో దగ్ధమైందని పోలీసులు తెలిపారు. బనగానపల్లె నుంచి సిమెంటు లోడుతో తమిళనాడుకు లారీ బయల్దేరిందని, మద్దూరు సమీపంలో లారీ వెనుక టైరు పంక్చర్ కావడంతో అదుపు తప్పి జాతీయ రహదారిపై వంతనపై ఉన్న డివైడర్‌ను ఢీకొనడంతో మంటలు రేగి కాలిపోయిందన్నారు. సమాచారం తెలుసుకున్న ఆళ్లగడ్డ అగ్నిమాపక అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవరు వేల్‌మురుగన్‌ను పోలీసులు, టోల్‌ప్లాజా సిబ్బంది గంటపాటు కష్టపడి బయటకు తీసి స్థానిక కేరళ ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.



కాలిపోయిన లారీ

బాలికల ఆశ్రమ పాఠశాల్లోకి యువకుల చొరబాటు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : పాణ్యం చెంచుకాలనీలో ఉన్న గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో యువకులు చొరబడిన ఘటన కలకలం రేపుతోంది. బుధవారం రాత్రి భోజనం అనంతరం విద్యార్థినులు ఎవరి గదుల్లోకి వారు వెళ్లిపోయారు. ఆ సమయంలో గుర్తు తెలియని ముగ్గురు యువకులు పాఠశాల ప్రహరీ గోడ ఎక్కి విద్యార్థినులు ఉన్న భవనంపైకి చేరుకున్నారు. వారిని గుర్తించిన విద్యార్థినులు భయంతో కేకలు వేశారు. దీంతో సిబ్బంది యువకులను పట్టుకోవడానికి ప్రయత్నించగా వారు పక్కనే ఉన్న పొలాల్లోకి దూకి పారిపోయారని ప్రధానాచార్యులు సునందలక్ష్మి తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు పాణ్యం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. 320 మంది విద్యార్థినులు ఉంటున్న ఆశ్రమ పాఠశాల్లోకి యువకులు చొరబడటంతో బాలికలు భయాందోళన ఉన్నారని పోలీసులు భద్రత కల్పించాలని ఆమె కోరారు.

బాలికపై అత్యాచారం

మిడుతూరు న్యూస్‌టుడే : మిడుతూరు మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన వడ్డే ఎల్లరాజు (22) అత్యాచారం చేసినట్లు బాధిత బాలిక గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై ఓబులేసు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : మండల పరిధిలోని నల్లకాల్వ గ్రామానికి చెందిన కాటెపోగు వెంకటరమణ (38) అనే రైతు గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం సాయంత్రం 4గంటలకు పొలానికి వెళ్లిన వెంకటరమణ తెగిపడిన విద్యుత్తు తీగ తగిలి పడిపోయాడు. రాత్రి అయిన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా పొలంలో విగతజీవిగా కనిపించాడు. వైద్యం కోసం ఆత్మకూరులోని ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు.

నంద్యాల
•నంద్యాల •నందికొట్కూరు •శ్రీశైలం •పాణ్యం

ఈకేవైసీ తప్పక చేయించుకోండి


మొక్కజొన్న పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

మహానంది న్యూస్‌టుడే : రైతులు ఈకేవైసీని తప్పకుండా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచించారు. మండలంలోని ఉల్లిగడ్డల బొల్లవరంలో గురువారం ఆయన ఈకేవైసీ నమోదు ప్రక్రియను పరిశీలించారు. సేంద్రియ, జీవన ఎరువులు వినియోగించడం ద్వారా నేలల్లో సూక్ష్మపోషకాల స్థాయి పెంచుకోవచ్చని చెప్పారు. మండల వ్యవసాయాధికారి బి.నాగేశ్వరరెడ్డి, ఏఈవో వెంకటేశ్వర్లు, గ్రామ వ్యవసాయాధికారి చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

నందికొట్కూరు, న్యూస్‌టుడే : నందికొట్కూరు పట్టణానికి కిలోమీటరు దూరంలో ఉన్న జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏపీ రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక పురపాలక కార్యాలయం వద్ద కాలనీవాసులతో కలిసి గురువారం ధర్నా చేపట్టారు. కాలనీలో తాగునీటి వసతి, రహదారులు, విద్యుత్తు దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ప్రయాణ కష్టాలపై గళమెత్తండి



నంద్యాల, నందికొట్కూరు, ఆత్మకూరు ఆర్టీసీ డిపోల పరిధిలో పలు సమస్యలు వేధిస్తున్నాయి. బస్టాండ్లలో సౌకర్యాలు కరవయ్యాయి. గ్రామీణ మార్గాల్లో బస్సులు సరిగా నడవడం లేదు. కండిషన్‌లో లేని బస్సులు దారి మధ్యలో మొరాయిస్తున్నాయి. విద్యార్థి బస్సులు సకాలంలో నడవక పిల్లలు వేళకు పాఠశాలలకు వెళ్లలేని పరిస్థితి. బస్టాండ్లలో వ్యాపారులు అధిక ధరలతో ప్రయాణికులను దోచుకుంటున్నారు. ఈ సమస్యలపై ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియడం లేదా? 'ఈనాడు' చేపట్టిన 'మేమున్నాం.. మీకు తోడుగా' కార్యక్రమంలో మీ గళం వినిపించండి. బస్టాండ్లలో సౌకర్యాలు కొరవడ్డాయా? వ్యాపారులు ఎమ్మార్పీ ధరల కంటే అధికంగా వసూలు చేస్తున్నారా? మరుగుదొడ్ల వద్ద ఎక్కువ డబ్బు తీసుకుంటున్నారా? మూత్రశాలలు, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయా? బస్సులు వేళకు రావడం లేదా? కింది నంబర్లకు ఫోన్‌చేసి చెప్పండి. మీ సమస్యలను సంబంధిత అధికారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

నంద్యాల : 9533454249
ఆత్మకూరు : 9014909024
నందికొట్కూరు : 9440361729

ఆత్మకూరులో ఆక్రమణల తొలగింపు

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే : ఆత్మకూరు పట్టణంలో రహదారులకు సమీపంలో నిర్మించిన అక్రమ నిర్మాణాల వల్ల ఇబ్బందులు పడుతున్నామంటూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై అధికారులు దృష్టి సారించారు. నూతన కమిషనరుగా బాధ్యతలు స్వీకరించిన రమేష్‌బాబు గౌడు


ఆక్రమణల తొలగింపు పరిశీలిస్తున్న కమిషనరు

కేంద్రం, పాత బస్టాండు, రఘునాథ్ సెంటరు, నంద్యాల మలుపు ప్రాంతాల్లో గురువారం క్షేత్ర స్థాయిలో పర్యటించి ఆక్రమణలను పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టరు జీవన్ కుమార్ ఆధ్వర్యంలో పొక్లెయిన్‌తో అక్రమ నిర్మాణాలు తొలగించారు.

నష్ట పరిహారం చెల్లించాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.30 వేల నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రాజశేఖర్, మండల కార్యదర్శి వీరన్న, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, పండ్లతోటల సంఘం అధ్యక్షుడు మహబూబ్‌బాషా డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఆత్మకూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దారు రత్నరాధికకు వినతి పత్రం అందజేశారు. నాయకులు శివుడు, అంబయ్య, రామసుబ్బయ్య, నాగన్న, పాల్గొన్నారు.

జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల సందడి

ఆత్మకూరు: దేవర సినిమా విడుదల సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు గురువారం ఆత్మకూరులో సందడి చేశారు. ఎన్టీరామారావు విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాల వేసి నినాదాలు చేశారు. ఎన్టీఆర్ విగ్రహం నుంచి నంద్యాల మలుపు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.

సంక్షేమం దిశగా రాష్ట్రం పరుగులు

నందికొట్కూరు, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలోనే రాష్ట్రం సంక్షోభాన్ని వీడి సంక్షేమం వైపు పరుగులు తీస్తోందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పేర్కొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

పట్టణంలో గురువారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 26వ వార్డులో కౌన్సిలర్ మందడివాణి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. పురపాలక ఛైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, ఉపఛైర్మన్ రబ్బానీ, కమిషనర్ బేబీ, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా, న్యూస్‌టుడే : తెదేపాతోనే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎంపీపీ వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం పారుమంచాల గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పనితీరును వివరించారు. గ్రామ సర్పంచి ప్రకాశం, నాయకులు రసూలు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. పిల్లల ప్రాణాలతో చెలగాటం

పగిడ్యాల మండలంలోని వివిధ గ్రామాల నుంచి నందికొట్కూరుకు వెళ్లే రహదారిలో ఆటోల చోదకులు పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళుతున్నారు. ఈ దారి భారీ గుంతలతో అధ్వానంగా మారింది. వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు రోడ్డు పక్కన గుంతల్లో చక్రాలు ఇరుక్కుపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలాంటి మార్గంలో విద్యార్థులు, చిన్నారులను ఆటోల వెనుకవైపు ఒకరిపై ఒకరిని కూర్చోబెట్టుకుని వేగంగా ప్రయాణిస్తున్నారు. కుదుపులకు పిల్లలు జారిపడితే ప్రాణాలకే ప్రమాదమని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
– న్యూస్‌టుడే, పగిడ్యాల



పుర స్థలం..
☛ జిల్లా కేంద్రంలో పేట్రేగిపోతున్న కబ్జాదారులు
☛ చర్యలకు వెనకాడుతున్న అధికారులు

అక్రమార్కులకు పందేరం


వర్మీ ఎరువుల కేంద్రంలో తొట్లు తొలగించి చదును చేశారిలా.

నంద్యాల పురపాలకం, రైతునగరం, న్యూస్‌టుడే : నంద్యాల పురపాలక సంఘంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణ యథేచ్ఛగా కొనసాగుతోంది. రూ.కోట్ల విలువైన స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయి. ఖాళీ జాగా కనిపిస్తే అక్రమార్కులు పాగా వేస్తున్నారు. అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రతి సచివాలయంలో పట్టణ ప్రణాళిక కార్యదర్శులు ఉన్నారు. వార్డు పరిధిలో జరుగుతున్న ఆక్రమణల గురించి తెలిసినా వారు బయటికి పొక్కనివ్వడం లేదు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. కబ్జాదారుల నుంచి వీరందరికీ ముడుపులు అందుతుండటంతోనే చర్యలకు వెనకాడుతున్నారని కౌన్సిల్‌లో కొన్ని లర్లు ఆరోపించినా సరే.. అధికారుల తీరు మారలేదు.. ఆక్రమణల జోరు తగ్గలేదు.


శ్రమదానం వంతెన వద్ద చామకాల్వ పొడవునా కబ్జాలే

ఎటుచూసినా ఆక్రమణలే..

◆ నంద్యాల శివారులోని రైతునగరం పరిధిలో సచివాలయం పక్కనే ఉన్న వర్మీ ఎరువుల తయారీ కేంద్రాన్ని ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నించారు. ఇందులో నిర్మించిన తొట్లను పగులగొట్టారు. ఇక్కడ బండపరుపు ఏర్పాటు కోసం బండలు కూడా తెప్పించారు. సచివాలయం పక్కనే కబ్జా జరుగుతున్నా.. దీని గురించి సామాజిక మాధ్యమాల్లో వచ్చేంత వరకు అధికారులకు తెలియకపోవడం గమనార్హం.

◆ రైతునగరం పరిధిలో అక్రమ లేఅవుట్లు వేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికే చాలాచోట్ల అనధికార వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్లు విక్రయించారు.

◆ పట్టణంలో పలుచోట్ల ఖాళీ స్థలాలను ఆక్రమించి బంకులు, షెడ్లు ఏర్పాటు చేసి అద్దెకిస్తున్నా పట్టణ ప్రణాళిక విభాగం వారు పట్టించుకున్న దాఖలాల్లేవు.

◆ పట్టణంలోని రెవెన్యూ క్వార్టర్స్ సమీపంలోని తాతయ్య గుడి పరిసరాల్లో చామకాల్వను కబ్జాకు గురైంది. 2017లో దీని పోరంబోకు స్థలంలో గోశాల ఏర్పాటు చేశారు. 2019లో వైకాపా ప్రభుత్వం వచ్చాక అప్పటి ప్రజాప్రతినిధి అండతో ఆ స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టారు. గోశాల పేరుతో 6 సెంట్లు, ఇంటి నిర్మాణం కోసం మరో 6 సెంట్లు ఆక్రమించారు.

◆ సాయిబాబానగర్‌లో సైతం చామకాల్వ స్థలంలో పెద్దఎత్తున భవనాలు నిర్మించారు. దీంతో ఈ ప్రాంతంలో కాల్వ పూర్తిగా కుచించుకుపోయింది. వరద వస్తే సాయిబాబానగర్ వద్ద ఉన్న వంతెనపై నీరు పారుతోంది. దీంతో ఎన్జీవోకాలనీ, నూనెపల్లె, సాయిబాబానగర్‌కు రాకపోకలు నిలిచిపోతున్నాయి.

◆ పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీ, విశ్వనగర్‌లో పలు భవనాలు కాల్వ స్థలంలోనే నిర్మించారు. దీంతో వరద నీరు విశ్వనగర్, ఎస్‌బీఐ కాలనీలోని వంతెనలపై ప్రవహిస్తోంది.

కేసులు నమోదు చేస్తున్నాం
- నిరంజన్‌రెడ్డి, పురపాలక కమిషనర్

పురపాలక స్థలాలు ఆక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. రైతునగరంలోని వర్మీ కంపోస్టు కేంద్రాన్ని పరిశీలించాం. తొట్లను ధ్వంసం చేసినట్లు గుర్తించాం. అక్కడ పరిచేందుకు తెచ్చిన బండలను సీజ్ చేశాం. తొట్లను తొలగించిన వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తాం.

సమస్యలు పరిష్కరించండి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. నంద్యాల పురపాలక కార్యాలయాన్ని గురువారం సీపీఐ నాయకులు ముట్టడించి ఆందోళన చేపట్టారు.


పురపాలక కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నంద్యాల పట్టణంలో రోజూ వీధికుక్కల దాడిలో ప్రజలు గాయాలపాలవుతున్నా పురపాలక అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. దోమల బెడదతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. శివారు ప్రాంతాలైన నందమూరినగర్, వైఎస్సార్ నగర్‌లలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, భాస్కర్, నాగరాముడు, సోమన్న, డి.శ్రీనివాసులు, బి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో శాంతి హోమం


పూర్ణాహుతి నిర్వహిస్తున్న ఈవో, అర్చకులు, వేదపండితులు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : లోకకల్యాణార్థం శ్రీశైల మహాక్షేత్రంలో గురువారం శాంతి హోమం నిర్వహించారు. వేకువజామున 5 గంటలకు ఆలయ ప్రాంగణంలోని అమ్మవారి యాగశాలలో హోమం చేపట్టారు. దేవస్థానం ఈవో డి.పెద్దిరాజు దంపతులు, ఆలయ అర్చకులు, వేదపండితులు సంకల్పం, గణపతిపూజ, పుణ్యాహవచనం పూజలు చేశారు. రుత్విగ్వరణం, మండపారాధనలు, పవమానహోమం, కుష్మాండహోమం, రాక్షోఘ్నసూక్త హోమం, శాంతిహోమం నిర్వహించి పూర్ణాహుతి జరిపారు.

మహానంది క్షేత్రంలో ప్రాయశ్చిత్త పూజలు

మహానంది, న్యూస్‌టుడే : తిరుపతి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడటం వల్ల జరిగిన అపవిత్రత తొలగాలంటూ మహానంది ఆలయంలో గురువారం ప్రాయశ్చిత్తి హోమాలు, పూజలు నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాలతో ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు అర్చకులు శివాష్టోత్తరం, నారాయణ సూక్తం, దేవీ అపరాధ స్తోత్రాలు, హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు.

వెలుగోడు, న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వ హయాంలో తిరుపతి లడ్డూను అపవిత్రం చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు పట్టణ తెదేపా, జనసేన నాయకులు సంఘీభావం తెలిపారు. వెలుగోడులోని లక్ష్మీప్రసన్న ఆలయంలో గురువారం నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెదేపా, జనసేన నాయకులు శంకర్‌రెడ్డి, షాలుబాష, సుకన్య, ప్రసన్న, భాస్కర్, వలి పాల్గొన్నారు.

వసతిగృహ సంరక్షకులపై చర్యలకు డిమాండు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : విధుల్లో అలసత్వం వహిస్తున్న జిల్లాలోని బీసీ సంక్షేమ వసతిగృహాల సంరక్షకులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ, పీఎస్‌యూ జిల్లా కార్యదర్శులు రాంబాబు, కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని జిల్లా బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో గురువారం వారు సూపరింటెండెంట్ గోవర్ధన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని బీసీ వసతిగృహ వార్డెన్లు విధులకు సరిగా హాజరువడం లేదన్నారు. బయోమెట్రిక్ ద్వారా కాకుండా మాన్యువల్‌గా విద్యార్థుల హాజరు నమోదు చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్, సాయి, శేఖర్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరు రహదారి నిబంధనలు పాటించాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ప్రతిఒక్కరు రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని నంద్యాల ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా పేర్కొన్నారు. స్థానిక నేషనల్ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రిన్సిపల్ వేణుగోపాల్ అధ్యక్షతన విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి ఒక్కరు డ్రైవింగ్‌పై అవగాహన కలిగుండాలన్నారు. వాహనాలు నడిపేవారంతా తప్పక డ్రైవింగ్ లైసెన్సు కలిగుండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించాలన్నారు.

ఐలమ్మ స్ఫూర్తితో పోరాడుదాం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : సామాజిక న్యాయం కోసం చాకలి ఐలమ్మ స్ఫూర్తితో పోరాడాలని రజక సంఘం అధ్యక్షుడు జిల్లెల్ల శ్రీరాములు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆయన గృహంలో గురువారం ఐలమ్మ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి రజక సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు జిల్లెల శ్రీదేవి, మద్దిలేటి, సంజీవరాయుడు, నాగరాజు, జమ్ములయ్య, తిరుపాలు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా, న్యూస్‌టుడే : భూమి, భుక్తి కోసం పోరాడిన చాకలి ఐలమ్మను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని రజక సంఘం నాయకుడు బస్తిపాటి మౌలాలి పేర్కొన్నారు. జూపాడుబంగ్లాలో గురువారం రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు నిర్వహించారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ మండల సమన్వయకర్త నాగసుంకమ్మ పేర్కొన్నారు. పాణ్యం ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం-3లో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.

కొండజూటూరు మాజీ సర్పంచి మృతికి సంతాపం

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని కొండజూటూరు మాజీ సర్పంచి పరదేశి ఏసన్న (95) అనారోగ్యంతో మృతి చెందారు. 2002 నుంచి 2007 వరకు ఆయన సర్పంచి పనిచేశారు. ఆయన మృతదేహానికి పలు పురు మండల, గ్రామ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు.

రూ.8.55 లక్షల ఎరువుల విక్రయాలు నిలిపివేత

నెహ్రూనగర్ (గోస్పాడు), న్యూస్‌టుడే : మండలంలోని నెహ్రూనగర్‌లోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఏవో స్వప్నిక గురువారం తనిఖీ చేశారు. లక్ష్మీ గణపతి ఏజెన్సీస్, శ్రీలక్ష్మీ నరసింహ ఫర్టిలైజర్స్, వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ దుకాణాల్లో దస్త్రాలు, నిల్వలను పరిశీలించారు. రికార్డులు సరిగాలేని రూ.8,55,250 విలువైన ఎరువులు, పురుగు మందుల అమ్మకాలు నిలిపేసినట్లు ఏవో తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించే ఉద్దేశంతో నంద్యాల పట్టణంలో ఈనెల 6న యూత్ ఫెస్ట్‌లో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. విజేతలకు గురువారం స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి డా.శారదాబాయి బహుమతులు, ప్రశంసాపత్రాలు, చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు వెంకటరత్నం, డా.కాంతారావు, డా.శ్రీజ, డా.ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఫరూక్‌ను కలిసిన సుబ్బారెడ్డి


మంత్రి ఫరూక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సుబ్బారెడ్డి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన డోన్ తెదేపా నాయకులు మన్నె సుబ్బారెడ్డి రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక మంత్రి కార్యాలయంలో గురువారం ఆయన మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

సమయానికి హాజరు వేయాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఉపాధ్యాయులు సరైన సమయానికి హాజరు వేయాలని మండల విద్యాధికారి-1 బాలాజీనాయక్, విద్యాధికారి-2 సురేశ్ పేర్కొన్నారు. ఆత్మకూరు ప్రభుత్వ బాలురోన్నత పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. కాంప్లెక్స్ స్థాయిలో వివిధ రకాల పోటీలు నిర్వహించి గెలిచిన వారిని ఈ నెల 28న మండల స్థాయి పోటీలకు పంపాలన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

కొత్తపల్లి న్యూస్‌టుడే : గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి చింతామణి అన్నారు. ఆమె గృహ నిర్మాణ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమావేశమయ్యారు. నిర్ణీత సమయంలో కేటాయించిన గృహ నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మేరి పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధితులకు చేయూతనివ్వాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : హెచ్‌ఐవీ బాధిత చిన్నారులకు చేయూతనివ్వాలని హెచ్‌ఐవీ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెంకటరత్నం, జిల్లా వైద్యపరీక్షల అధికారి దేవీశం కర్‌గౌడ్ పేర్కొన్నారు. స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో గురువారం కళాశాల ఛైర్మన్ డా.జి.రామకృష్ణారెడ్డి సౌజన్యంతో 50 మంది హెచ్‌ఐవీ బాధిత చిన్నారులకు పోషకాహార కిట్లు, మందులు పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ సుబ్బయ్య, వైఆర్‌జీ సమన్వయకర్త ప్రసాద్, హెచ్‌ఐవీ పాజిటివ్ నెట్‌వర్క్ అధ్యక్షురాలు బి.సుధారాణి, సుజాత, నాగమణి, ఆదిలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అటవీ భూముల్లో ముళ్లపొదల తొలగింపు

మహానంది, న్యూస్‌టుడే : మహానంది చెంచులక్ష్మి గూడెం చెంచులు అటవీ భూముల్లో గురువారం ముళ్లపొదలు తొలగింపు చేపట్టారు. తాము సాగు చేసుకుంటున్న పొలాలకు విద్యుత్తు సరఫరా ఇవ్వకుండా అటవీ అధికారులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ గూడెం నాయకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో పొలాల్లో పనులు చేపట్టారు. చెంచుల చర్యను అటవీశాఖ సిబ్బంది వీడియోలు తీసి ఉన్నతాధికారులకు పంపించారు.

వరిలో చీడపీడల ఉద్ధృతిని గుర్తించాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : వరి పంట సాగు చేసే రైతులు చీడపీడల ఉద్ధృతిని గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని సంజీవనగర్ తాండాలో గురువారం ఇండి-గ్యాప్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగాకర్షక బుట్టలు ఎకరాకు 5-10 ఏర్పాటు చేసుకుంటే, మగ పురుగును ఆకర్షించి గుడ్లు పెట్టే అవకాశం లేకుండా చేస్తాయన్నారు. అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ ఎకరాకు 120 గ్రా. లేదా కాసుగమైసిన్ మందును ఎకరాకు 400-600 మి.లీ చొప్పున పిచికారి చేయాలన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

మహానంది, న్యూస్‌టుడే : మహానంది మండలం సీతారామాపురం గ్రామంలో ఆగస్టు నెలలో పసుపులేటి పెద్ద సుబ్బరాయుడును బండరాయితో మోది హతమార్చిన కేసులో నిందితుడైన రామసుబ్బయ్యను గురువారం అరెస్టు చేసినట్లు ఎస్సై ఎన్.రామమోహన్‌రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు 24 మందిని అరెస్టు చేశామన్నారు. మరో ఇద్దరిని అరెస్టు చేయాల్సి ఉందని చెప్పారు.

పీరుసాహెబ్‌పేటలో ఇరువర్గాల ఘర్షణ

మిడుతూరు, న్యూస్‌టుడే : మండలంలోని పీరుసాహెబ్‌పేట గ్రామంలో గురువారం ఓ వ్యక్తి ద్విచక్రవాహనం నడుపుతూ మరొకరికి తగిలించడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఇందుకు సంబంధించి ఒక్కో వర్గం నుంచి ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వ్యాపారిపై కేసు నమోదు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైలానికి చెందిన వ్యాపారి పి.రామ్మోహన్‌పై పలు సెక్షన్ల కింద సున్నిపెంట రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. గత జులై 11న లింగాలగట్టు చెక్‌పోస్టు వద్ద జరిగిన విందుకు రామ్మోహన్, పి.అనిల్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఆ సమయంలో తన వాహనాలు, రూ.లక్ష నగదును రామ్మోహన్ దొంగలించారని అనిల్‌కుమార్‌రెడ్డి ఆరోపిస్తున్నారు. ఈమేరకు ఆయన ఆత్మకూరు జూనియర్ సివిల్ కోర్టు ద్వారా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు గురువారం పోలీసులు తెలిపారు.

శ్రీనివాసులు మృతి తీరనిలోటు

మహానంది, న్యూస్‌టుడే : మహానంది గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు సూరే శ్రీనివాసులు (56) అకాల మరణం పార్టీకి తీరని లోటని శ్రీశైలం నియోజకవర్గ తెదేపా సమన్వయకర్త బన్నూరు రామలింగారెడ్డి పేర్కొన్నారు. నంద్యాల ఆర్టీవో కార్యాలయానికి గురువారం పని నిమిత్తం వెళ్లిన ఆయన అస్వస్థతకు గురయ్యారన్నారు. అక్కడే ఆసుపత్రిలో చేర్పించగా మృతి చెందినట్లు చెప్పారు. నాయకులు బసిరెడ్డి నాగభూపాల్‌రెడ్డి, మండల తెదేపా అధ్యక్షుడు ఉల్లి మధు, మహానంది దేవస్థానం ఏఈవో వై.మధు తదితరులు నివాళి అర్పించారు.

ధరలు తగ్గించి..
◆ మొక్కజొన్న కొనుగోలులో మాయాజాలం
◆ వ్యాపారులు, దళారుల ఇష్టారాజ్యం

రైతులను ముంచి


మొక్కజొన్న కాటా వేస్తున్న కూలీలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఖరీఫ్‌లో సాగు చేసిన మొక్కజొన్నకు పంట భారీ వర్షాలు తీవ్ర నష్టం కలిగించాయి. అధిక విస్తీర్ణంలో పంట దెబ్బతింది. మిగిలిన కొద్దిపాటి పంటను కర్షకులు అష్టకష్టాలు పడి కాపాడుకున్నారు. ప్రస్తుతం నూర్పిళ్లు చేస్తున్నారు. దిగుబడులు అరకొరగా వచ్చాయి. ఖరీఫ్‌లో మొక్కజొన్న సాధారణ దిగుబడి 25 నుంచి 30 క్వింటాళ్లు. ఈ ఏడాది 5- 10 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. మొదట్లో ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ప్రస్తుతం చినుకులు పడుతుండటంతో.. ఇదే అదనుగా దళారులు ధరలు తగ్గించి రైతులను దగా చేస్తున్నారు.

ఒక్కసారిగా తగ్గించేశారు

మొక్కజొన్న ధర దళారుల ఇష్టంగా మారింది. వారం కింద వ్యాపారులు పోటీపడి మొక్కజొన్నలు కొనుగోలు చేశారు. క్వింటా ధర రూ.2700 నుంచి రూ.2,900 వరకు ధర పలికాయి. నాలుగు రోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో ధరలు తగ్గించేశారు. వ్యాపారం మందగించిందని, పైన సరకు కొనడం లేదని చెబుతూ ధర అమాంతం తగ్గించేశారు. గురువారం క్వింటా మొక్కజొన్నలు రూ.2280తో కొనుగోలు చేశారు.

వ్యాపారులు, ఏజెంట్లు కుమ్మక్కై..

మొక్కజొన్న కొనుగోలులో కమీషన్ వ్యాపారులు కుమ్మక్కై ధర తగ్గించేస్తున్నారు. గుంటూరు, విజయవాడ, కాకినాడ, నెల్లూరు ప్రాంతాల నుంచి దిగుబడులు కొనేందుకు వచ్చిన వ్యాపారులు ఆత్మకూరులోని లాడ్జిలలో తిష్టవేసి కమీషన్ ఏజెంట్లను ఆశ్రయిస్తున్నారు. వీరు వ్యాపారులతో ఒప్పందం కుదుర్చుకుని ధరలను అమాంతం తగ్గించేస్తున్నారు.

నాణ్యత బూచిగా చూపి..

వర్షాలకు పంటను పురుగులు, తెగుళ్లు చుట్టుముట్టాయి. వీటివల్ల పంట దెబ్బతినడంతో మొక్కజొన్న గింజల్లో నాణ్యత లోపించింది. దీనిని సాకుగా చూపి వ్యాపారులు ధరలు తగ్గించేస్తున్నారు. ఓవైపు ముసురు వేసింది. దీంతో దిగుబడులను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. వాటిని ఆరబెట్టేందుకు కూలీల ఖర్చులు భారీగా పెరిగాయి. ఈ ఖర్చులకు జంకి పేద రైతులు దళారులు చెప్పిన ధరలకు దిగుబడులు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

తక్కువ ధరకు విక్రయించా - శ్రీకాంత్, రైతు, కరివేన



నేను ఐదెకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. అధిక వర్షాలకు పంట జోమెక్కింది. కాపాడుకునేందుకు ఎక్కువ మోతాదులో ఎరువుల వాడాల్సి వచ్చింది. గతంలో ఎకరాకు 35 క్వింటాళ్లకు పైగా పండించాను. ఈ ఏడాది ఎకరాకు పది క్వింటాళ్లు కూడా పండలేదు. వారం కిందట క్వింటా ధర రూ.2700 ఉండేది. ఒక్కసారిగా ధర తగ్గించారు. దీంతో క్వింటా రూ.2280 ప్రకారం విక్రయించా.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి
- రమేష్‌బాబు, కరివేన



నేను పదెకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. ఏడెకరాల్లో పంట పూర్తిగా దెబ్బతింది. మూడెకరాల్లో మాత్రమే మిగిలింది. ఎకరాకు పది క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. రైతులు పంట కోయగానే వ్యాపారులు ధర తగ్గించేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఆదుకోవాలి.

కాలనీ కబుర్లు

డిగ్రీ కళాశాల (నందికొట్కూరు) : నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. గురువారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రధానాచార్యులు సునీత ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి ఖాజాహుస్సేన్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

హౌసింగ్ బోర్డు కాలనీ (నందికొట్కూరు) : వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలన గురించి తెదేపా నాయకులు మల్లికార్జునరెడ్డి, రవీంద్రారెడ్డి, లింగమయ్యలు ఇంటింటికీ తిరుగుతూ 'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాలను పంపిణీ చేశారు.

సంగయ్యపేట (నందికొట్కూరు) : నందికొట్కూరు పట్టణం తెదేపా పార్టీ నాయకుడు, యూనిట్ ఇన్‌చార్జీ సత్తార్‌మియ్య ప్రమాదవశాత్తు కిందపడి కాలు విరిగింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గిత్త జయసూర్య సత్తార్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు మాండ్ర సురేంద్రానాథ్‌రెడ్డి, జాకీర్, మర్తుజావలి, మహేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పురపాలక కార్యాలయం (నందికొట్కూరు) : ఈనెల 28న పురపాలక సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ బేబీ తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి అన్ని శాఖల అధికారులు, కౌన్సిలర్లు హాజరు కావాలని కమిషనర్ కోరారు.

ఆత్మకూరు రోడ్డు (నందికొట్కూరు) : దసరా పండుగ సందర్భంగా శమీ వృక్షం వద్ద పురపాలక ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. వర్షం కురిసిన భక్తులకు బురద అంటుకోకూడదని కంకర వేసి చదును చేస్తున్నారు.

సాయిబాబపేట (నందికొట్కూరు) : పట్టణంలోని సాయిబాబపేట కాలనీలోని ఖాళీ స్థలాల్లోకి వర్షం నీరు వచ్చి నిల్వ ఉంటోంది. దీంతో దోమలు బెడద పెరిగిందని, దోమల మందు పిచికారీ చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఆళ్లగడ్డ
• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రమేష్

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను సత్వరమే అమలు చేసి ప్రజా సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో వైబీ వెంకటేశ్వర్లు అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సీఐటీయూ నాయకులు నాగరాజు, ఎల్లయ్య, మద్దిలేటిస్వామి, షేబారాణి, నాగేంద్రమ్మ, సంజీవుడు, మధుశేఖర్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: డోన్ ఆర్టీసీ డిపో కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం. శశిభూషణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు, ప్రజలు తమ సమస్యలను, సలహాలు, సూచనలను 9959225795 చరవాణికి ఫోన్ చేసి తెలపాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

శిరివెళ్ల: **సమస్య :** వనికెన్‌దిన్నె ప్రధానరహదారిపై చెత్తను వేస్తున్నారు.- **బాల లింగమయ్య.**

సమాధానం : ప్రధాన రహదారిపైన చెత్తను వేయకుండా చుట్టు పక్కల కాలనీవాసులకు నోటీసులు అందిస్తాం. **-నాగేంద్రుడు, ఈవోపీఆర్డీ, శిరివెళ్ల.**

దసరా ఉత్సవాల పుస్తకావిష్కరణ

చాగలమర్రి, న్యూస్‌టుడే: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల పుస్తకావిష్కరణ గురువారం నిర్వహించారు. ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు వంకదార లక్ష్మణబాబు మాట్లాడుతూ వచ్చేనెల 3 నుంచి 15 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నామన్నారు. ఆర్యవైశ్య సభ ఉపాధ్యక్షుడు తొమ్మండ్రు మల్లికార్జున, బచ్చు సుబ్రహ్మణ్యం, ఉప కార్యదర్శులు జ్వాలానరసింహులు, బచ్చు శ్రీనివాసులు, కోశాధికారి నవత ప్రసాదు, సభ్యులు బాబు, తొమ్మండ్రు నాగేంద్ర పాల్గొన్నారు.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: అమ్మవారిశాలలో వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి శరన్నవ రాత్రి మహోత్సవాలను జయప్రదం చేయాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుండాగోపాల్, బచ్చు సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. అమ్మవారిశాలలో వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి శరన్నవరాత్రి ఉత్సవాల పుస్తకాలను విడుదల చేశారు.

అక్రమంగా ఇసుక తరలింపు

ప్యాపిలి, న్యూస్‌టుడే: చిగురుమానిమిట్ట వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఫొటో తీసి గురువారం కొందరు వాట్సప్‌లో షేర్ చేశారు. అక్రమంగా ఇసుక రవాణా జరగకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: కొండపేటకు చెందిన ఓ యువకుడు కర్నూలులో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు సీఐ ఇంతియాజ్ బాషా తెలిపారు. ఈనెల 18న కొండపేటకు చెందిన చిన్నకేశవులు, హరి, రంగముని, మౌలాలి పాత గొడవల్ని మనసులో ఉంచుకుని అదే కాలనీకి చెందిన మదార్‌వలి(23)పై దాడి చేసి గాయపరిచారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు ఆయన్ని తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు.

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చించివేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని గురువారం వైకాపా నాయకులు పట్టణ ఎస్సై శరత్‌కుమార్ రెడ్డికి ఫిర్యాదు చేశారు.

వైద్యసేవల కనుమరుగు

పదేళ్లుగా ఎదురుచూపులే



కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రి

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎన్నో ఏళ్లుగా తాలూకా స్థాయిలో రోగులకు వైద్య సేవలు అందిస్తోంది. ప్రస్తుతం కోవెలకుంట్లలో సుమారు 30వేలకు పైగా జనాభా ఉండగా మండలంలోని అన్ని గ్రామాలు కలుపుకొని సుమారు 55 వేలకు పైగా ఉంటారు. మండలంలోని గ్రామాలే గాక చుట్టుపక్కల ఉన్న దొర్నిపాడు, ఉయ్యాలవాడ, సంజామల, అవుకు మండలాల నుంచి రోగులు ఇక్కడకు వస్తుంటారు. ఇక్కడ ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రస్తుతం 300 నుంచి 350 మంది వరకు రోగులు వైద్య సేవలకు వస్తుంటారు. ఇంత పెద్ద ఆసుపత్రిలో హోమియో వైద్య సేవలు కొన్నేళ్ల నుంచి కనుమరుగయ్యాయి.

దేశంలో ప్రాచీన వైద్యంలో ఆయుర్వేద, హోమియో, యునాని, సిద్ధ, న్యాచురోపతి వంటివి ఎంతో ముఖ్యమైనవి. వైద్యరంగం అభివృద్ధి చెందకముందు ఈ ప్రాచీన వైద్యంతోనే రోగులకు మందులు ఇచ్చి చికిత్సలు అందించేవారు. ఈ వైద్యసేవలను ప్రజలకు అందించాలనే ఉద్దేశంతోనే కేంద్రం ఎప్పటి నుంచో వీటిని అన్ని ఆసుపత్రుల్లో ఏర్పాటు చేసింది. కోవెలకుంట్లలోని ప్రభుత్వ ఆసుపత్రిలోనూ హోమియో వైద్యాన్ని అందుబాటులో ఉంచింది. గతంలో పాతభవనాల్లో రోగులకు హోమియో వైద్య సేవలు అందించేవారు. ఈసేవలను అందించేందుకు ప్రత్యేకంగా వైద్యులు, ఫార్మాసిస్టు, అటెండర్ ఉండేవారు. పదేళ్ల కిందట ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వైద్యురాలు బనగానపల్లికి వెళ్లిపోవడం, మిగిలిన సిబ్బందికి వేతనాలు సక్రమంగా అందకపోవడంతో విధులు నిర్వర్తించడం మానేశారు. అప్పటి నుంచి ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో సిబ్బంది నియామకం జరగక హోమియో వైద్య సేవలు ఈ ప్రాంత రోగులకు అందకుండా పోయాయి. రేవనూరు, దొర్నిపాడు, ఉయ్యాలవాడ, సంజామల మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో యునానీ ఆసుపత్రి ఉండగా కోవెలకుంట్ల ప్రాంతంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో హోమియో వైద్య సేవలు అందించకపోవడంపై పలువురు విమర్శిస్తున్నారు. ఈ సేవల్ని పునఃప్రారంభించాలని కోరుతున్నారు.

వైద్య సేవలు కొనసాగించాలి - మధు, కోవెలకుంట్ల

ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా హోమియో వైద్యులను సంప్రదించి మందులు వాడేవాడిని. దీర్ఘకాలిక రోగాలకు ఈ మందులు ఎంతో బాగా పనిచేసేవి. ఇప్పుడు హోమియో ఆసుపత్రి లేకపోవడంతో ఆరోగ్య సమస్య తలెత్తినప్పుడు గత్యంతరం లేక ఇంగ్లిష్ మందులతో చికిత్స తీసుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం మళ్లీ హోమియో ఆసుపత్రిని ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలి.

రూ.1.20 కోట్లతో రెండో పట్టణ ఆరోగ్య కేంద్రం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ పురపాలిక పరిధిలో రూ.1.20కోట్లతో రెండో పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని నిర్మిస్తామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. గురువారం పడకండ్లలో ఆరోగ్యకేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. పట్టణ ఆరోగ్య కేంద్రంలో చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు చికిత్స అందిస్తారన్నారు. డీఎంహెచ్‌వో డా.ఆర్.వెంకటరమణ, డా.నరసింహ, తెదేపా నాయకులు డా.సి.రాంగోపాల్ రెడ్డి, సి.శేఖర్‌రెడ్డి, శూలం నరసింహుడు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి



మొక్కలు నాటుతున్న వృక్ష యజ్ఞం సభ్యులు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని వృక్ష యజ్ఞం సేవా సంస్థ అధ్యక్షురాలు లావణ్య పేర్కొన్నారు. గురువారం సేవా సంస్థ సభ్యులు పట్టణంలోని శ్రీ భారతి విద్యామందిరంలో మొక్కలు నాటారు. ప్రతి విద్యార్థి తనవంతు బాధ్యతగా ఒక మొక్కను నాటడమేకాక, దాన్ని పెంచేందుకు కృషి చేయాలన్నారు. ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడు అమీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో పట్టణ అభివృద్ధి



కమిషనర్‌ను కలిసి సత్కరిస్తున్న రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బంది

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: ప్రజల సహకారంతో పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని కొత్త కమిషనర్ ఎస్. ప్రసాద్ గౌడ్ పేర్కొన్నారు. డోన్ మున్సిపల్ కార్యాలయానికి ఆయన్ని బదిలీ చేయడంతో ఆయన బాధ్యతలు చేపట్టి ఆయన మాట్లాడారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో ఆస్తి పన్నులు చెల్లించడంలోనూ, చెత్త సేకరణకు సంబంధించి తడి, పొడి చెత్త వేర్వేరుగా తమ సిబ్బందికి అందించి పట్టణ పరిశుభ్రతకు సహకారం అందరూ అందించాలని ప్రజలను ఆయన కోరారు. అనంతరం సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అన్నివర్గాల అభ్యున్నతే తెదేపా ధ్యేయం



సామూహిక సీమంతంలో ఎమ్మెల్యే

చాగలమర్రి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా తెదేపా పని చేస్తుందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. చాగలమర్రి పట్టణంలోని అజీం బ్రిలియంట్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. తొలుత గ్రామానికి చేరుకున్న ఆమెను తెదేపా శ్రేణులు గజమాలలతో స్వాగతం పలికాయి. అంగన్‌వాడీ కార్యకర్తలు జరిపిన సామూహిక సీమంతంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లు అతికించారు. తెదేపా మైనార్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, మండల కన్వీనరు నరసింహారెడ్డి, మండల ప్రత్యేక అధికారి జాకీర్‌హుసేన్, తహసీల్దారు రవికుమార్, ఎంపీడీవో మహబూబ్‌దౌలా తదితరులు పాల్గొన్నారు.

బాచేపల్లె(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును తిట్టడమే వైకాపా నాయకుల పని అని, ప్రజలకు మేలు చేయడం తమ పని అని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పేర్కొన్నారు. గురువారం బాచేపల్లె గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: కొలిమిగుండ్లలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. తెదేపా నాయకులు గూడూరు నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటికి వెళ్లి నూరు రోజుల్లో చేసిన అభివృద్ధిని వివరించారు. నాగార్జునరెడ్డి, రాము, ప్రసాద్, విజయ్, టైలర్ రాము, పాల్గొన్నారు.

యనకండ్ల (బనగానపల్లి గ్రామీణం): యనకండ్లలో తెదేపా నాయకులు 'ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అతికించి కరపత్రాలు పంపిణీ చేశారు.

గుంజలపాడు, లింగాల: గుంజలపాడు, లింగాల గ్రామాల్లో గురువారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

వల్లంపాడు: వల్లంపాడు గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు స్టిక్కర్లు పంపిణీ చేశారు. సర్పంచి జగదీశ్వర రెడ్డి పాల్గొన్నారు

రామచంద్రాపురం (దొర్నిపాడు), న్యూస్‌టుడే: రామచంద్రాపురంలో తెదేపా నాయకుల ఆధ్వరంలో కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం గురువారం నిర్వహించారు. తెదేపా నాయకుడు దయానంద, కార్యకర్తలు పాల్గొన్నారు.

డోన్, న్యూస్‌టుడే: గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటేనే తల్లీబిడ్డలు ఆరోగ్యకరంగా ఉంటారని ఎంపీడీవో శ్రీనివాసులు, ఐసీడీఎస్ సీడీపీవో షంషాద్ బేగం అన్నారు. మండలంలోని బి. రామదుర్గం గ్రామంలో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మాట్లాడారు.

చిన్నమల్కాపురం (డోన్), న్యూస్‌టుడే: పారిశుద్ధ్యం మెరుగ్గా ఉంటేనే గ్రామం స్వచ్ఛంగా ఉంటుందని తెదేపా నాయకులు సుధాకర్‌రెడ్డి, సుబ్రమణ్యం అన్నారు. చిన్నమల్కాపురం గ్రామంలో ఇదిమంచిప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పంచాయతీకి వచ్చిన చెత్తబుట్టలను పంపిణీ చేశారు. మురళి, వెంకటేశ్వర్లు, అంజి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

విద్యాబోధన చేయాలి

ప్యాపిలి, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటపాటల ద్వారా విద్యాబోధన చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దేవకృపమ్మ, ప్రీస్కూల్ నిర్వాహకులు ఉపేంద్ర అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. 7వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషక వారోత్సవాలను గురువారం నిర్వహించారు.

సీపీఐ మండల కార్యదర్శిగా నారాయణ

డోన్, న్యూస్‌టుడే: డోన్ మండల సీపీఐ కార్యదర్శిగా నారాయణ గురువారం ఎన్నికయ్యారు

పల్లె కబుర్లు

ఉయ్యాలవాడ: అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని ఆళ్లగడ్డ ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ మురళీధర్ అన్నారు. మాయలూరు అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఏఈ ప్రణీత్‌కృష్ణతో కలిసి ఆయన పరిశీలించారు.

ఉయ్యాలవాడ: ఉయ్యాలవాడ వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ సెలవుపై వెళ్లడంతో సంజామల మండల వ్యవసాయాధికారి సుధాకరరెడ్డికి ఉయ్యాలవాడ వ్యవసాయాధికారిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

రామకృష్ణాపురం(బనగానపల్లి గ్రామీణం): రామకృష్ణాపురంలో గురువారం నందివర్గం ఎస్సై వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. అనంతరం గ్రామసభ నిర్వహించారు.

పలుకూరు(బనగానపల్లె గ్రామీణం): పలుకూరులో వాహనాల బ్యాటరీలు చోరీకి గురవ్వడంతో కేసు నమోదు చేసినట్లు నందివర్గం ఎస్సై వెంకటసుబ్బయ్య గురువారం తెలిపారు. పెట్రోల్ బంకులో సురేష్‌గౌడ్‌కు చెందిన ఆటో బ్యాటరీ, ట్రాక్టరు బ్యాటరీని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారని ఎస్సై తెలిపారు.

బనగానపల్లె గ్రామీణం: బనగానపల్లె మండలంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన మహ్మద్‌రఫీ, ముకుందారెడ్డి, విజయను ఏపీయూఎస్ నాయకుల ఆధ్వర్యంలో గురువారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వారి సేవల్ని కొనియాడారు.

బనగానపల్లె గ్రామీణం: ప్రతి వాహనదారుడు బీమా చేయించుకోవాలని ఎస్సై దుగ్గిరెడ్డి పేర్కొన్నారు. పలుకూరుకు చెందిన పాండురంగడు విద్యుత్తుషాక్‌తో మృతిచెందారు. బీమా కలిగి ఉండటంతో కంపెనీ నుంచి రూ.7లక్షల చెక్కు కంపెనీ ప్రతినిధులు, బనగానపల్లె ఎస్సై ద్వారా నామినీ అయిన మృతుడి భార్యకు అందజేశారు.

కోవెలకుంట్ల గ్రామీణం: ఆర్టీసీ బస్టాండు ఆవరణలో వర్షం నీరు నిలిచి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతల్లో నీరు నిలిచి ద్విచక్ర వాహనదారులు, ఆటో ప్రయాణికులుఅవస్థల పాలవుతున్నారు.

డి.కొట్టాల(రుద్రవరం), న్యూస్‌టుడే: డి.కొట్టాలలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వర్షాలు కురుస్తున్నందున గ్రామంలో సీసీ రహదారులపై మురుగు, మట్టి దిబ్బలు చేరి బురదగా మారడంతో తెదేపా నాయకులు జేసీబీ, ట్రాక్టర్ల ద్వారా శుభ్రపరిచారు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గ్రామాల్లో పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఈవోపీఆర్డీ నాగేంద్రుడు తెలిపారు. మండలంలోని శిరివెళ్ల, గోవిందపల్లె గ్రామాల్లో పనుల కాలనీలలో శుభ్రతా పనులను ఈవోపీఆర్డీ గురువారం పరిశీలించారు.

సంజామల, న్యూస్‌టుడే: తూకాల్లో తేడాలు రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని డోన్ డివిజన్ లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ఎ.ఖాజాహుసేన్ అన్నారు. ప్రభుత్వ చౌక ధరల దుకాణాల తూకాల యంత్రాలను ఆయన గురువారం సరిచూశారు.

ఆర్.నాగులవరం(రుద్రవరం), న్యూస్‌టుడే: ఆర్.నాగులవరం, టి.లింగందిన్నె గ్రామాల్లో మన ఇల్లు- మన ఊరు గ్రామసభలు నిర్వహించినట్లు ఈవోపీఆర్డీ శ్రీనివాస శర్మ తెలిపారు.

బలపాలపల్లె, కొలుముపల్లె(బేతంచెర్ల), న్యూస్‌టుడే: గ్రామాల్లో అందరూ కలసి మెలసి ఉండాలని, అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. గురువారం మండలంలోని బలపాలపల్లె, కొలుములపల్లె గ్రామాల్లో పర్యటించారు.

దోమల నివారణకు చర్యలు

ప్యాపిలి, న్యూస్‌టుడే: కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఈవో శివకుమార్‌గౌడ్ తెలిపారు. బస్టాండు నుంచి మెయిన్‌బజార్, చిల్లాకట్టా, దిగువవీధి వరకు పంచాయతీ సిబ్బంది ద్రావణాలను పిచికారీ చేశారు.

దాతల సాయం అందజేత

డోన్, న్యూస్‌టుడే: ఇటీవల రోడ్డుప్రమాదంలో గాయపడిన చిన్నారి మోక్షిత్ వైద్యానికి రూ.1,16,385 లక్షల చెక్కును దాతలు అందించారు. ద్రోణాచలసేవాసమితి ఆధ్వర్యంలో గురువారం దాతలు అందించిన ఈ సాయాన్ని తహసీల్దారు నాగమణి చేతుల మీదుగా బాధితులకు అందజేశారు.

ప్యాపిలి, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన మురళి డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తూ ఈ నెల 2న అనారోగ్యంతో మృతి చెందారు. తోటి డ్రైవర్లు అంత్యక్రియల్లో పాల్గొని మానవత్వాన్ని చాటుకున్నారు. ఆ కుటుంబానికి అండగా రూ.40 వేల పోగు చేసి మిత్రుడి కుటుంబానికి నగదును గురువారం అందజేశారు.

తెదేపా నాయకులను కలిసిన సుబ్బారెడ్డి



భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని కలిసిన సుబ్బారెడ్డి

డోన్, బేతంచెర్ల, న్యూస్‌టుడే: రాష్ట్రవిత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా ఎన్నికైన తెదేపా నాయకులు సుబ్బారెడ్డి గురువారం విజయవాడలో తెదేపా జాతీయప్రధానకార్యదర్శి మాజీఎమ్మెల్సీ బీదరవిచంద్రయాదవ్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, శాప్‌ఛైర్మన్‌అనిమినిరవి నాయుడులను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సుబ్బారెడ్డి మొదటిసారి శుక్రవారం ఉదయం 10 గంటలకు డోన్‌కు వస్తున్నట్లు తెలిపారు.

సంత అక్కడ.. ట్రాఫిక్ సమస్య ఇక్కడ

ఆళ్లగడ్డలో ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకు ఎక్కువవుతున్నాయి. ప్రతి గురువారం ఇక్కడ సంత జరుగుతుంది. దీనికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా పట్టణానికి చెందిన వారు వేలాదిగా వస్తుంటారు. రహదారులపైనే వాహనాలను నిలిపేస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సీఐ చిరంజీవి తెలిపారు.

– న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ



వర్షపునీరు.. ఇబ్బందులు జోరు



చాగలమర్రి పట్టణంలోని వాసవీ డిగ్రీ కళాశాల సమీపంలోని కాలనీల్లో కొద్దిపాటి వర్షం కురిసినా కాలనీ మొత్తం వర్షపు నీటితో నిండిపోతుంది. ప్రధాన రహదారి ఎత్తులో ఉండడంతో కాలనీలు లోతట్టుగా ఉండడంతో వర్షం కురిసిన ప్రతిసారీ కాలనీ మొత్తం వర్షపు నీటితో నిండిపోతుంది. నీరు తొలగిపోయేలా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, చాగలమర్రి

సౌకర్యాలు సమకూరక..

ఇబ్బందులు తీరక

☛ అభివృద్ధికి ఆమడ దూరంలో కాలనీలు



సీసీ రోడ్డుకు నోచుకోని చాకలిపేట రోడ్డు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: "పట్టణ అభివృద్ధికి కృషి చేస్తాం. వార్డుల్లో కనీస మౌలిక సదుపాయాలను కల్పిస్తాం. వీధుల్లో ఏ సమస్య వచ్చినా మా దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.. నాటి వైకాపా పాలకులు, అధికారులు చెప్పిన మాటలివి. ఆచరణలో మాత్రం విఫలమవుతున్నారు. ఐదేళ్లపాటు కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలని మొరపెట్టుకున్నా ..పట్టించుకునే దిక్కే లేకపోయింది. ఆయా సమస్యలతో కాలనీ వాసులు ఇబ్బందుల మధ్య జీవనాన్ని కొనసాగిస్తున్నారు. పన్నులు చెల్లిస్తున్నా పాట్లు తప్పడం లేదని వాపోతున్నారు. వార్డుల్లోని వీధుల్లో రహదారులు, కాల్వలు, వీధి దీపాలు, కల్వర్టులు లేక అవస్థలుపడుతున్నామంటున్నారు.

దారి కష్టాలు చూడండి

కోటపేట, చాకలిపేట, రేగిమాను పేటలో సీసీరోడ్లు, మురుగు కాల్వలు, తాగునీటి గొట్టాల ఏర్పాటు లేక ఇబ్బందులుపడుతున్నారు. కాలనీవాసుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నగర పంచాయతీ అధికారులు రూ.1.15 లక్షలతో మూడు సంవత్సరాల కిందట ఇంటింటికి కుళాయిలు, మురుగు కాలువల నిర్మాణానికి పనులు ప్రారంభించారు. గతంలో ఉన్న రోడ్డును తవ్వేశారు. సీసీరోడ్డు వేయకపోవడంతో కాలనీవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాళ్ల దారిలో ద్విచక్ర వాహన చోదకులు, పిల్లలు, వృద్ధులు నడవాలంటే ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు.

సీసీరోడ్ల నిర్మాణానికి చర్యలు

- శేఖర్‌బాబు మున్సిపల్ ఇంజినీరు, బేతంచెర్ల

కొత్తబస్టాండు ఏరియాలో ఎంపీడీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న కాలనీల్లో సిమెంట్ రోడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. సిమెంట్ రోడ్లు, కాల్వల నిర్మాణాలకు రూ.1.50 కోట్లతో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే రోడ్లు, కాలువల పనులు చేపడతాం.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు, పీడీ

రాజనగరం (శిరివెళ్ల), న్యూస్‌టుడే: రాజనగరం జడ్పీపాఠశాలలో ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. జడ్పీపాఠశాలలో హెచ్ఎం గురువారం మాట్లాడారు. క్రీడాపోటీల్లో ప్రతిభ చూపిన ఇద్దరు విద్యార్థులను పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, పీడీ అభినందించారు.

మందులు ఆసుపత్రిలోనే ఇవ్వాలి



దస్త్రాలను తనిఖీ చేస్తున్న డా.జఫ్రుల్లా

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ సీహెచ్‌సీకి వచ్చే రోగులకు మందులను, ఇతర ఆరోగ్య పరీక్షలను బయట చేయించుకోవాలని రాయొద్దని, ఆసుపత్రిలోనే ఇవ్వాలని డీసీహెచ్ఎస్ డా.జఫ్రుల్లా అన్నారు. గురువారం ఆళ్లగడ్డ సీహెచ్‌సీని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు.

మెరుగైన పరీక్షలు నిర్వహించాలి

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: క్షయ, ఎయిడ్స్ రోగాలకు సంబంధించి మెరుగైన పరీక్షలు నిర్వహించాలని జిల్లా లెప్రసీ (క్షయ, ఎయిడ్స్) అధికారిణి శారదాబాయి అన్నారు. కోవెలకుంట్లలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలోని ఐసీటీసీ, క్షయ పరీక్షల కేంద్రాన్ని, ల్యాబ్‌ను గురువారం ఆమె తనిఖీ చేశారు.



దస్త్రాలు పరిశీలిస్తున్న శారద

రుద్రవరం, న్యూస్‌టుడే: ఆలమూరు పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో డా.ఆర్.వెంకటరమణ గురువారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఓపీ వార్డును, ముందుల గదిని, ల్యాబ్, కాన్పుల వార్డులను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులతో స్నేహపూర్వకంగా మసలుకోవాలని, ఆరోగ్య సమస్యను పరిష్కరించే భరోసా కల్పించాలన్నారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: యర్రగుంట్లలోని రెండు ఎరువుల దుకాణాలపై వ్యవసాయశాఖ, విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. గోదాములో ఉన్న ఎరువులకు, పుస్తకాల్లో లెక్కలకు తేడా ఉండటంతో రూ.9.98 లక్షల విలువ చేసే ఎరువుల అమ్మకాలు నిలుపుదల చేయగా, మరో దుకాణంలో యూరియాను అధికధరకు విక్రయిస్తున్నట్లు గుర్తించి గోదాములో ఉన్న రూ.1.43 లక్షల విలువ చేసే యూరియా స్టాక్‌ను సీజ్ చేసినట్లు విజిలెన్స్ అధికారి రూపస్ రోనాల్డ్ తెలిపారు.

పలువురికి బదిలీలు

దొర్నిపాడు, న్యూస్‌టుడే: పలువురు అధికారులకు బదిలీలు జరిగాయని ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. దొర్నిపాడు ఎంపీడీవోగా సావిత్రి తుగ్గలి మండలం నుంచి, ఈవోపీఆర్డీగా సులోచన పత్తికొండ నుంచి వస్తున్నారని, దొర్నిపాడు పంచాయతీ కార్యదర్శి నాగార్జున చాకరాజువేములకు, రుద్రవరం మండలం ఆర్.నాగులవరం కార్యదర్శి ఓబులేసు క్రిష్టిపాడుకు, శిరివెళ్ల మండలం కోటపాడు కార్యదర్శి షరీఫాబి గుండుపాపలకు బదిలీపై వస్తున్నట్లు తెలిపారు. గుండుపాపల పంచాయితీ కార్యదర్శి వెంకటనారాయణ సంజామలకు, కొండాపురం కార్యదర్శి సుమిత్ర ఉయ్యాలవాడ మండలం కొండుపల్లికి బదిలీపై వెళ్తున్నారని తెలిపారు.

క్షేత్రస్థాయి సందర్శనతో విజ్ఞాన వికాసం

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయి సందర్శన వల్లే విద్యార్థులు విజ్ఞాన వికాసాన్ని పొందగలుగుతారని ఉయ్యాలవాడ ఆదర్శ పాఠశాల అదనపు ప్రధానాచార్యుడు ఇష్వాకార్ తెలిపారు. ఆదర్శ పాఠశాలలో వృత్తి విద్యా కోర్సు చదివే విద్యార్థులకు గురువారం క్షేత్రసందర్శనలో భాగంగా రైసుమిల్లు తీరు, బీఎస్ఎన్ఎల్ కేబుల్ నెట్‌వర్క్, వృత్తి నైపుణ్యత సాధనకు ప్రవేశ పెట్టిన కోర్సులపై శిక్షకులు ఉసేన్‌వలీ, బి.వెంకట రమణ తదితరులు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ



డోన్, న్యూస్‌టుడే: డోన్ పట్టణంలోని కొండపేటలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కేశన్నగౌడ్, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడ్, కిరణ్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో వరదబాధితులకు విరాళాల సేకరణ చేపట్టారు. కొండపేట ప్రాంతంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు విరాళాలు సేకరించారు.

వేతన వెతలు

☛ మూడేళ్లుగా ఎదురుచూపులు
☛ హరితరాయబారులకు అవస్థలు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న హరిత రాయబారులు

ముత్యాలపాడు(చాగలమర్రి), న్యూస్‌టుడే: ముత్యాలపాడు గ్రామ పంచాయతీ పరిధిలో రెండు సచివాలయాలు ఉండగా ఇక్కడ అయిదుగురు హరిత రాయబారులు ఉన్నారు. పంచాయతీ పరిధిలో చెత్త సేకరణ, వాటి నిర్వహణ బాధ్యతను పర్యవేక్షించే పలువురు హరితరాయబారులకు మూడేళ్లుగా వేతనాలు అందడం లేదని వాపోతున్నారు. పంచాయతీ పరిధిలోని చెత్తను ట్రాక్టరు ద్వారా సేకరించి డంపింగ్ యార్డు ప్రాంతంలో వేయడం వారి విధి. ప్రతి నెలా హరిత రాయబారులకు నెలకు రూ.6వేలు వేతనం ఇవ్వాల్సి ఉండగా, గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం తమను పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వమైనా తమ కష్టాలను గట్టెక్కించాలని కోరుతున్నారు. అధికారులు స్పందించాలంటున్నారు.

త్వరలో చెల్లిస్తాం

- యేసుదాసు, పంచాయతీ కార్యదర్శి

ముత్యాలపాడు గ్రామ పంచాయతీ పరిధిలో హరిత రాయబారులకు వేతనాలు అందలేదనడం వాస్తవమే. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో వారికి వేతనాలు వచ్చేలా చూస్తాం.